## రిపోర్టర్లు కావలెను

ఎప్పటికప్పుడు వాస్తవ కథనాలను అందిస్తూ అనతికాలంలోనే ప్రజాదరణ పొందిన'తొలి ఆకాంక్ష' దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పని చేయడానికి జిల్లాల వారిగా బ్యూరోలు, నియోజకవర్గాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, మండల వారిగా కంట్రిబ్యూటర్లు కావలెను.

సెల్ :8333818121.9908333465

మీ బయోడేటా పై నంబర్లకి వాట్సాప్ ద్వారా పంపగలరు



# తొలి ఆకాంక్ష

TGTEL/25/A1964

akankshanews.com

తెలుగు సంచలన దిన పత్రిక



## రిపోర్టర్లు కావలెను

పామమ్యడికి అండగా,ప్రశ్నించే గొంతుకగా, ప్రజా చైతన్యమే లక్ష్యంగా మాతవంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల,ఖమ్మం, ఆసిఫాబాద్,ఆదిలాబాద్,జగిత్యాల,జయశంకర్ భూపాలపల్లి,కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల,మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్, మెదక్, నల్గొండ,నిర్మల్, నారాయణపేట,సూర్యాపేట,వికారాబాద్,వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి,హన్మకొండ జిల్లాల్లో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

స్టాఫ్ రిపోర్టర్లు, మండల, నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

Contact Number :
9908333465.8333818121



ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 71 ఎడిటర్ :పెనుగొండ సతీష్ శనివారం 18 అక్టోబర్ 2025 పేజీలు 8 వెల 5.00








## బిసి బిల్లును అడ్డుకున్న

# పాపం బిజెపిదే

- బిల్లును అడ్డుకోవడంవల్లనే బిసి బంద్
- బంద్‌కు పూర్తి బాధ్యత బిజెపిదే
- దమ్ముంటే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి
- బిజెపిని డిమాండ్ చేసిన డిప్యూటి సిఎం భట్టి

(ఆకాంక్ష న్యూస్)

ఖమ్మం, అక్టోబర్ 17 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు దేశంలో ఎక్కడా లేని విధంగా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తొలిసారిగా సైంటిఫిక్‌గా తెలంగాణలో కులగణన నిర్వహించామని.. సర్వే ద్వారా వచ్చిన సమాచారంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చూసినట్లు తెలిపారు. చట్ట సభల్లో ఏకగ్రీవాగంగా ప్రవేశ పెట్టామని.. గవర్నర్, రాష్ట్రపతికి పంపించినట్లు తెలిపారు. అయితే తాము పాస్ చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుకట్ట వేసి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతోందని ఆరోపించారు. ఇది బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని భట్టి మండిపడ్డారు. ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేశామని.. బీజేపీ పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీల




నాయకులు సంఘీభావం తెలిపారని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు పాస్ చేయడమే కాకుండా న్యాయస్థానాలకు కూడా వెళ్తోందన్నారు. ఓబీసీపై సుప్రీం కోర్టులో ప్రముఖ న్యాయవాదులు పోరాడుతున్నారని తెలిపారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం పంపిన

2లో

## లొంగిపోయిన

# మావో అగ్రనేత ఆశన్న

- ఆశన్న సహా 208మంది మావోల లొంగుబాటు
- భారీగా ఆయుధాలు అప్పగింత
- వారి పునరావాసానికి ఏర్పాట్లు చేస్తామన్న ఛత్తీస్‌ఘడ్ సిఎం

(ఆకాంక్ష న్యూస్)

రాయపూర్, అక్టోబర్ 17 :మావోయిస్టు అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ పోలీసుల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టు చరిత్రలో ఇదే అతిపెద్ద లొంగుబాటు. వారిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. 153 ఆయుధాలు అప్పగించగా.. వీటిల్లో 19 ఏకే-47 రైఫిళ్లు, 17 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 23 ఇన్సాస్‌లు, 1 ఇన్సాస్ ఎల్ఎంజీ, 303 రైఫిళ్లు, 11 బీజీఎల్, నాలుగు కార్బైన్‌లు, 41 బోర్ షాట్‌గన్‌లు, పిస్తోళ్లు ఉన్నాయి. ఈ లొంగుబాటుపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ మాట్లాడారు. ఇది ఛత్తీస్‌గఢ్‌కే కాదు దేశం మొత్తానికి చరిత్రాత్మకమైన రోజు. హింసను వీడి జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని మేం వారిని కోరుతూ వచ్చాం. ఇప్పుడు వారికి నైపుణ్యాలు కల్పించి, పునరావాసానికి ఏర్పాటు చేస్తాం అని వెల్లడించారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో కలిసిన గంటల వ్యవధిలోనే ఆశన్న లొంగుబాటు ప్రకటన వచ్చింది. ఇద్దరు అగ్రనేతలు పోరాటాన్ని వీడటంతో మావోయిస్టు పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామం. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్‌వార్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వాసుదేవరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం అప్పటి హనుమకొండ మండలం కాజీపేటలోని ఫాతిమా స్కూల్‌లో సెకండరీ విద్యనభ్యసించారు. కాకతీయ వర్సిటీలో డిగ్రీ చదువుతూ రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ)కు నాయకత్వం వహిస్తూ ఆ

2లో

## బిసి బంద్‌కు మద్దతుగా సంఘాల ర్యాలీ

### ర్యాలీలో పాల్గొన్న కృష్ణయ్య, కోదండరామ్




(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబరు17: బీసీ రిజర్వేషన్ల పరిరక్షణెళి ధ్యేయంగా ఈనెల 18న తెలంగాణ బంద్‌కు బీసీ సంఘాల ఐకాస పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో బంద్‌కు మద్దతుగా అఖిలపక్ష, బీసీ సంఘాలు హైదరాబాద్‌లో ముందస్తు సంఘీభావ ర్యాలీ నిర్వహించాయి. బషీరాబాగ్ కూడలి నుంచి ట్యాంక్ బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. బీసీ ఐకాస ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య, తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరాం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, బీసీ ఐకాస వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్లో చేర్చి చట్ట సవరణ చేయాలని ఈ సందర్భంగా నేతలు


2లో

## పెద్దపల్లి జిల్లా ఓదెలలో మల్లికార్జున స్వామి

# ఆలయంలో వివాదం

- ధర్మకర్తల మండలి ప్రవర్తనపై అర్చకుల ఆవేదన
- రాజకీయ జోక్యం వల్ల ఆలయ వాతావరణం దెబ్బతింటుందని ఆరోపణలు






ఓదెల,అక్టోబర్17(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని పవిత్ర క్షేత్రం ఓదుల మల్లికార్జున స్వామి దేవస్థానం ప్రాచీనమైన శైవక్షేత్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ ఆలయం చరిత్ర శతాబ్దాలనాటి పురాణ గాథలతో ముడిపడి ఉందని స్థానిక పెద్దలు చెబుతుంటారు.ప్రచారంలో ఉన్న కథనం ప్రకారం, ఈ ప్రదేశంలో పూర్వం సుదీర్ఘంగా తపస్సు చేసిన ఒక మునికి శివుడు స్వయంగా దర్శనమిచ్చి మల్లి కార్జున స్వరూపంలో ఆవిర్భవించినట్లు చెబుతారు. ఆ దివ్యదర్శ నానికి గుర్తుగా ఆ ముని శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారని, ఆ లింగం క్రమంగా శక్తి సంపూర్ణంగా మారి ఈ ప్రాంతానికి పుణ్యక్షేత్ర స్థాయి తెచ్చిందని చెబుతారు. ఇక ఓదెల మల్లికార్జున స్వామి ఆలయం వేములవాడ రాజన్న ఆలయానికి సమానమైన చారిత్రక నేపథ్యం కలిగి ఉందని పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. శివుని పంచారామాలలో ఒక రూపమైన మల్లికార్జునుడి ఆరాధన ఇక్కడ పురాతన కాలం నుంచే కొనసాగుతోంది. ఆలయ శిల్పకళలో చాళుక్య, యుగాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. రాతి స్తంభాలపై చెక్కిన నంది, గణపతి, కార్తికేయ, నాటరాజ రూపాలు శిల్పకళా నైపుణ్యాన్ని చాటుతాయి. ప్రధాన గర్భగుడిలో ప్రతిష్ఠించిన శివలింగం స్వయంభూ లింగం అని భావిస్తారు. ఈ లింగం పైన నిరంతరం నీటి చుక్కలు పడుతుంటాయి, దీన్ని శివుని అనుగ్రహ సూచకంగా పరిగణిస్తారు.మల్లికార్జున స్వామితో పాటు ఇక్కడ బసవన్న, నందీశ్వర, పార్వతీ అమ్మవారు, గణపతి దేవతల విగ్రహాలు కూడా ప్రతిష్ఠించబడి పూజలందుకుంటున్నాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్న వృక్షాలు, ముఖ్యంగా బిల్వవృక్షం పవిత్రతకు చిహ్నంగా పరిగణిస్తారు.ప్రతి సంవత్సరం మహాశివరాత్రి, కార్తీక దీపోత్సవం, రుద్రాభిషేకం, కైరవోత్సవం వంటి పండుగలను ఇక్కడ భక్తులు ఘనంగా జరుపుకుంటారు. దూరదూరాల నుండి భక్తులు చేరి స్వామి దర్శనంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతారు. ఈ దేవస్థానం గురించి ప్రత్యేకత ఏమిటంటే - శివలింగాన్ని చూసినవారు తమ మనసులో ఉన్న కోరికలు నెరవేరుతాయనే విశ్వాసం కలిగి

2లో

## పత్తిని కేంద్రమే కొనుగోలు చేస్తుంది

- సీసీఐ ద్వారా క్వింటాల్ పత్తి రూ.8,110కు కొనుగోలు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 17 : కేంద్ర ప్రభుత్వం పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. క్వింటాల్ పత్తి రూ.8,110 ధరకు సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. తెలంగాణలో పత్తి సాగు ఉత్పత్తి పెరుగుతోందని.. పత్తి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ముందు ఉందన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో వరితో పాటు అత్యధికంగా సాగవుతున్న పంట పత్తి అని.. రాష్ట్రంలో 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతోందని తెలిపారు. 22 లక్షలకు పైగా రైతులు పత్తిని పండిస్తున్నారన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. పత్తి రైతులు దళారుల చేతిలో పడి మోస పోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చివరి క్వింటాల్ వరకు కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. కొనుగోలు కేంద్రాలను మరో 12పెంచామని.. మొత్తం 122 కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు కేంద్రమంత్రి. పత్తి సాగు ఉ

2లో

## స్థానిక ఎన్నికలు ఎప్పుడో చెప్పండి

- ప్రభుత్వం, ఇసిని ప్రశ్నించిన హైకోర్టు
- గడువు కోరడంతో విచారణ రెండు వారాలకు వాయిదా

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 17 : తెలంగాణ స్థానిక ఎన్నికల నిర్వహణపై కీలక పరిణామాలు చూటుచేసుకుంటున్నాయి. తాజాగా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై రీనోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని పిటిషన్ లో దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ఈసీ నోటిఫికేషన్ ను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ న్యాయవాది సురేందర్ పిటిషన్ వేశారు. దీనిపై

2లో



# మారుమూల గ్రామాలకు సైతం నెట్ సేవలు

## - రూ.5 వేల కోట్ల నిధులతో పోస్టల్ సంస్థ బలోపేతం
## - కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, అక్టోబరు 17 : భారతదేశంలో ప్రతి మారుమూల గ్రామానికి భారత్ నెట్ సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతంలో పరిశ్రమలు రావడానికి కావలిసిన ఎకో సిస్టమ్స్ అభివృద్ధి చేయడానికి అనేక రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఒకసారి ఎకో సిస్టమ్ ఏర్పాటు అయిన తర్వాత రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని చెప్పుకొచ్చారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. ఖర్చులు ఎక్కువగా ఉండి, ఆదాయం తక్కువగా ఉండే పోస్టల్ డిపార్ట్‌మెంట్ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రూ.5 వేల కోట్ల నిధులతో పోస్టల్ సంస్థ నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే కాలంలో పోస్టల్ సంస్థను ఆదాయం అందించే సంస్థగా తీర్చిదిద్దుతామని పెమ్మసాని చంద్రశేఖర్ ఉద్ఘాటించారు. ప్రస్తుతం గూగుల్ డాటా సెంటర్ ఏర్పాటైన తర్వాత చాలా సంస్థలు ఆ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నాయని వివరించారు. బెంగళూర్ లాంటి ప్రాంతాల్లో ఒక ఎకో సిస్టం ఏర్పాటైందని.. ఆ ప్రాంతంతో విశాఖపట్నానికి పోలిక అవసరం లేదని స్పష్టం చేశారు. పోస్టల్, బీఎస్ఎన్ఎల్, తదితర సంస్థలను కామన్ మ్యాన్‌కు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచడానికి దాదాపుగా 20 వేల కొత్త సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వినియోగదారుల భద్రత కోసం సంచార్ సాతి యాప్ సేవలను అందిస్తున్నామని తెలిపారు. టెలికాం వినియోగదారులను ÷నాన్షియల్ ఫ్రాడ్‌ల నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

## ఆర్.కృష్ణయ్యను కలిసిన పద్మశాలి సంఘం అధ్యక్షులు

(ఆకాంక్ష న్యూస్)

మెదక్, అక్టోబర్ 17 : రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను మెదక్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మ్యాకల జయరాములు నేత మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము చదువు కొనే రోజుల్లో బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉండి చదువుకునే వారమన్నారు. ఈ నెల18న జరప తలపెట్టిన బీసీ బంధుకు మెదక్ జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని కార్యక్రమానికి పూర్తి మద్దతు ప్రకటించాలని, బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రతీ ఒక్క బీసీ బిడ్డ ఉద్యమం చేయాలని జయరాములు ప్రకటించారు.

## రూ.110 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్,అక్టోబరు17 : హైడ్రా మరో భూమికి విముక్తి కలిగించింది. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని కుల్సుంపురాలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 1.30 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. రూ.110 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ప్రజావసరాలకు ఈ భూమిని వినియోగించాలని గతంలో ప్రభుత్వం భావించింది. మరోవైపు అశోక్ సింగ్ అనే వ్యక్తి దీన్ని తన భూమిగా చెబుతున్నాడు. ఈక్రమంలో సిటీ సివిల్ కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ భూమిలో ఇప్పటికే రెండు సార్లు రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించారు. అయినా అశోక్ సింగ్ స్థలాన్ని ఖాళీ చేయడంలేదు.

# అటవీ అధికారులపై గిరిజనుల దాడి

మొదటిపేజీ తరువాయి

పాల్పడ్డారు. ఈ దాడిలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు గోవింద్, కోటేష్‌కి గాయాలయ్యాయి. గాయాలైన అధికారులకి స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై అధికారులు కరకగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు ఆదివాసీ పోడు రైతులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫారెస్ట్ అధికారులపై దాడి చేస్తే ఊరుకునేది లేదని ఆదివాసీ పోడు రైతులని పోలీసులు హెచ్చరించారు.

# ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వానికి లేఖ

## - హైకోర్టుకు వివరించిన ఇసి తరపు లాయర్

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబరు 17 : బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశంపై ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది విద్యాసాగర్ హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం నుంచి సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ సురేందర్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని గత విచారణ సందర్భంగా ఆదేశించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల విడుదల చేసిన స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలుపుదల చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

# బిసి బిల్లును అడ్డుకున్న పాపం బిజెపిదే

మొదటిపేజీ తరువాయి

బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో పెట్టక పోవడం వల్లే... ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్ కష్టమని సుప్రీం కోర్టు చెప్పే పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ పార్టీ వల్లనే బీసీ రిజర్వేషన్ల అంశం ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. దీని వల్ల రాష్ట్రంలో ఓబీసీ సంఘాలన్నీ కూడా రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. రేపు జరిగే ఓబీసీ బంద్‌కు ప్రధాన కారణం బీజేపీ అని అన్నారు. ఓబీసీల బంద్‌లో అన్ని పార్టీల సంఘాలు ఆమోదం తెలిపాయని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఓబీసీ బిల్లుపై ఎందుకు మొండి వైఖరి చూపిస్తున్నారని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్‌లను ప్రశ్నించారు. ప్రధానితో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఓబీసీ బిల్లును ఎందుకు పాస్ చేయించడం లేదని నిలదీశారు. బిల్లులకు అడ్డుపడుతూ మళ్ళీ కాంగ్రెస్ పార్టీ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క బీసీలే కాదు అన్ని వర్గాల ప్రజలు కూడా.. బీజేపీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ చేస్తున్న ఆగడాలను అందరూ గమనిస్తున్నారని.. కమలం పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ఈ బంద్ జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి పంపినా కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ప్రధానిని కలిసేందుకు సీఎం రేవంత్ లేఖ రాసినా ఆయన సమయమివ్వలేదని చెప్పారు. ఈ అంశంలో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రధాని సమయం ఇస్తే.. అఖిలపక్షంతో కలిసి వచ్చేందుకు సీఎం రేవంత్ సిద్ధమని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టిన విషయాన్ని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేందుకు భాజపా ఎందుకు అడ్డుపడుతోందని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్ భాజపా వైఖరికి వ్యతిరేకంగా జరుగుతోందన్నారు. దీనికి కాంగ్రెస్ శ్రేణులతో పాటు అందరూ మద్దతు తెలపాలని కోరారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు డిప్యూటీ సీఎం. సింగరేణి కార్మికులకు దీపావళికి 400 కోట్ల రూపాయల బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. సింగరేణి ఖమ్మం జిల్లా నుండే మొదలైందని.. ఇక్కడ మొదలై రాష్ట్రం అంతటా వ్యాపించిందన్నారు. సింగరేణి కార్మికులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



# లొంగిపోయిన మావో అగ్రనేత ఆశన్న

మొదటిపేజీ తరువాయి

తర్వాత పరిణామాల నేపథ్యంలో 25 ఏళ్ల వయసులోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం వాసుదేవరావు వయసు 60 ఏళ్లు పైబడి ఉంటుందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. కీలక దాడులకు ఆశన్న వ్యూహకర్త. దండకారణ్య సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా రూపేశ్ పేరుతో వ్యవహరించిన ఆశన్న.. ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డిలపై బాంబులు పేల్చి హత్యాయత్నం, 1999లో ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర హత్య, 2000లో నాటి హోంమంత్రి మాధవరెడ్డి హత్య లాంటి ఘటనలకు నేతృత్వం వహించినట్లు చెబుతారు.

# స్థానిక ఎన్నికలు ఎప్పుడో చెప్పండి

మొదటిపేజీ తరువాయి

ఇవాళ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. వాదనలు విన్న హైకోర్టు.. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ను ప్రశ్నించింది. ఎన్నికలు నిర్వహణపై సమాధానం చెప్పేందుకు రెండు వారాల సమయం ఇవ్వాలని న్యాయస్థానాన్ని ప్రభుత్వం, ఈసీ కోరింది. దీంతో హైకోర్టు ఇందుకు అంగీకరించి రెండు వరాల సమయం ఇచ్చింది. అనంతరం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచూ ప్రభుత్వం జారీచేసిన జీవోను హోకోర్టు కొట్టివేడంతో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ సస్పెండ్ చేస్తూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఈ నెల 9 న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ జీవో ప్రకారమే ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే హైకోర్టు ఆ జీవోపై స్టే విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టకుండానే అత్యున్నత న్యాయస్థానం సైతం రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేయడంతో రిజర్వేషన్ల పంచాయితీ అగమ్యగోచరంగా మారింది. దీనితో స్థానిక ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అటు ప్రభుత్వం నుంచి ఆర్డర్స్ రాకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. గురువారం సుప్రీంకోర్టు కూడా ఎన్నికలకు వెళ్లమని చెప్పింది కదా అంటూ వ్యాఖ్యానించింది. ఎన్నికలు పెట్టుకోవచ్చని ఓరల్‌గా మాత్రమే చెప్పిందని.. ఆర్డర్‌లో ఎక్కడా చెప్పలేదని ఎలక్షన్ కమిషన్ తరఫు న్యాయవాది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాశామని కోర్టుకు తెలిపారు. బీసీ రిజర్వేషన్లలను 42 శాతానికి పెంచుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చాం కాబట్టే దాన్ని సస్పెండ్ చేశాం. మళ్లీ రిజర్వేషన్లను గూర్చి ప్రభుత్వంతో చర్చించాకే రీ నోటిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. రెండు వారాల సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం కోర్టును కోరడంతో తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

# పత్తిని కేంద్రమే కొనుగోలు చేస్తుంది

మొదటిపేజీ తరువాయి

తృత్తిలో సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. తొమ్మిది ప్రాంతీయ భాషల్లో పత్తి సాగుకు సంబంధించి కిసాన్ యాప్‌ను తీసుకొచ్చామని.. యాప్‌లో రైతులు నమోదు చేసుకుంటే.. స్లాట్ ద్వారా పత్తిని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని అన్నారు. పత్తి శుద్ధి, రవాణా కోసం జిన్నింగ్ మిల్లులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. హై డెన్సిటీ ఎలాంటేషన్ వల్ల పంట దిగుబడి డబుల్ అవుతుందని తెలిపారు. మహారాష్ట్ర అకోలా ప్రాంత ప్రజలు హై డెన్సిటీ ఎలాంటేషన్ చేస్తున్నారని.. హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్‌పై అవగాహన కోసం అవసరమైతే రైతులను మహారాష్ట్రకు తీసుకెళ్తామని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి మన రైతులు హై డెన్సిటీ ఎలాంటేషన్ చేసేలా పని చేస్తామన్నారు. కిసాన్ యాప్ దీపావళి నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పదేళ్లలో కనీస మద్దతు ధర వంద శాతం పెరిగిందన్నారు. నకిలీ విత్తనాల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయని.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపుతున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# మీ అబ్బాయికి ప్రమాదం జరిగింది

మొదటిపేజీ తరువాయి

జరిగిందంటూ' తాజాగా ఓ మహిళ నుంచి లక్షల్లో డబ్బులను సైబర్ నేరగాళ్లు కాజేశారు. హైదరాబాద్ నగరంలో 61 ఏళ్ల వృద్ధురాలు నివాసం ఉంటుంది. ఆమె కొడుకు లండన్ నగరంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో తాజాగా స్టీవ్ అనే వ్యక్తి ఆ పెద్దావిడకు వాట్సాప్ కాల్ చేశాడు. తాను లండన్ లో వైద్యుడిగా పని చేస్తున్నాను అంటూ పరిచయం చేసుకున్నాడు. లండన్ విమానాశ్రయంలో ఆమె కుమారుడికి ప్రమాదం జరిగిందని, తలకు బలమైన గాయమైందని సైబర్ నేరగాళ్లు చెప్పారు. అంతేకాక లగేజ్ మిస్ అవ్వడంతో ఎలాంటి ఐడెంటిటీ లేదని, ఆసుపత్రిలో వైద్యులు చేర్చుకోవట్లేదని చెప్పిన నేరగాళ్లు ఆమెను భయపెట్టారు. దీంతో ఎలాగైనా తన కుమారుడికి చికిత్స అందించాలని విడతల వారీగా రూ. 35.23లక్షలు వృద్ధురాలు ఆ కేటుగాళ్లకు పంపింది. తన కొడుకు ఎలా ఉన్నాడో చూసేందుకు ఫొటో, వీడియో పంపించాలని కోరగా.. కాల్ చేసిన వ్యక్తి అందుకు ఒప్పుకోలేదు. అనుమానం వచ్చిన బాధితురాలు కుమారుడి నెంబర్ కు కాల్ చేసింది. తాను క్షేమంగా ఉన్నానని, ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన వృద్ధురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# పెద్దపల్లి జిల్లా ఓదెలలో మల్లికార్జున స్వామి ఆలయంలో వివాదం

మొదటిపేజీ తరువాయి

ఉంటారు. వివాహ సమస్యలు, ఆరోగ్య సమస్యలు, సంతాన సాఫల్యం కోసం ఈ క్షేత్రాన్ని దర్శిస్తే ఫలితం తప్పక లభిస్తుందని భక్తుల అనుభవాలు చెబుతాయి. ఓదెల మల్లికార్జున స్వామి ఆలయం కేవలం భక్తి క్షేత్రమే కాదు, శాంతి, సమాధానానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ ఆలయం చుట్టుపక్కల గాలిలోనూ ఆధ్యాత్మికత పరిమళిస్తుంది. ఉదయం వేళలో జరిగే మంగళహారతి, సాయంత్రపు దీపారాధన ఈ క్షేత్రానికి ప్రత్యేక వైభవాన్ని తెస్తాయి. ఇది కేవలం ఓదెల గ్రామ ప్రజలకే కాకుండా పెద్దపల్లి జిల్లావాసులందరికీ గర్వకారణం. ఆలయ చరిత్ర, ప్రాముఖ్యత తెలిసినవారెవరైనా ఒకసారి ఈ పవిత్ర క్షేత్రాన్ని దర్శించి మల్లికార్జున స్వామి అనుగ్రహాన్ని పొందాలని భక్తులు విశ్వసిస్తారు. ఇప్పుడు ఈ ఆలయం కొందరి స్వార్థపూరిత ప్రయోజనాల వల్ల వివాదాల్లోకి వెళుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి దీనిపై "ఆకాంక్ష" ప్రత్యేక పూర్తిస్థాయి కథనం... పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని చారిత్రాత్మక మల్లికార్జున స్వామి దేవాలయం మరోసారి చర్చనీయాంశమైంది. శతాబ్దాల చరిత్ర గల ఈ ఆలయంలో ఇటీవల ఏర్పాటైన కొత్త ధర్మకర్తల మండలి ప్రవర్తనపై ఆలయంలో విధులు నిర్వహిస్తున్న అర్చకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మకర్తల మండలిలోని కొందరు సభ్యులు, చైర్మన్ స్థాయిలో ఉన్నవారు కూడా అర్చకుల పట్ల అసభ్య పదజాలంతో మాట్లాడటం, అగౌరవంగా ప్రవర్తించడం, వారిని చిన్నచూపు చూడడం జరుగుతోందని వారు ఆరోపించారు. అర్చకులు పేర్కొన్న వివరాల ప్రకారం, వారు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నప్పటికీ ధర్మకర్తల మండలి తరచుగా జోక్యం చేసుకుంటూ ఆలయ వ్యవహారాలను క్షోభకు గురిచేస్తోందని తెలిపారు. ఈ వ్యవహారంపై భక్తులలో కూడా ఆందోళన వ్యక్తమవుతోందని వారు పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బంది కలిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, తమ మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లికార్జున స్వామి దేవాలయం ప్రాంతీయంగా మాత్రమే కాకుండా ఆధ్యాత్మికపరంగా కూడా గొప్ప ప్రాధాన్యం కలిగిన ప్రదేశమని, ఈ ఆలయంలో రాజకీయ ప్రమేయం పెరగడం వల్ల పూజారుల మధ్య, భక్తుల మధ్య భిన్నాభిప్రాయాలు చెలరేగుతున్నాయని అర్చకులు తెలిపారు. గతంలో ఈ ఆలయం సాంప్రదాయ పద్ధతిలో సాగుతూ భక్తుల విశ్వాసానికి కేంద్రంగా నిలిచిందని, కానీ ఇప్పుడు ధర్మకర్తల మండలి రాజకీయ ప్రభావంలో నడుస్తోందని వారు వ్యాఖ్యానించారు. అర్చకులు పేర్కొన్నదేమిటంటే, ధర్మకర్తల మండలిలోని కొందరు సభ్యులు తాము కావలసిన విధంగా నిర్ణయాలు తీసుకుంటూ, అర్చకులను అవమానపరుస్తూ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆలయంలోని పూజా కార్యక్రమాల నిర్వహణ, నిత్య సేవల వ్యవస్థపై కూడా వారు అనవసర జోక్యాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆలయ వ్యవహారాల్లో అర్చకుల పాత్ర ప్రధానమైనది. భక్తుల సేవ చేయడమే మా ధర్మం. భక్తుల మనోభావాలను దెబ్బతీయడం ఎవరి హక్కు కాదని అర్చకులు తెలిపారు.

పూజారులను బెదిరించడం, సిబ్బందిని బెదిరించడం సమంజసం కాదని వారు హెచ్చరించారు. ఇక, ఈ వివాదంపై స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు స్పందించాలని అర్చకులు కోరారు. మాకు ఎమ్మెల్యేపై పూర్తి విశ్వాసం ఉందని ఆయన ఈ సమస్యపై స్పందించి న్యాయం చేస్తారని నమ్మకం అని అర్చకులు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం పని చేయడం ధర్మకర్తల ప్రధాన బాధ్యత అని, కానీ వారు ఆ బాధ్యతను పక్కన పెట్టి అర్చకులపై అహంకారంగా ప్రవర్తించడం వల్ల పరిస్థితి క్లిష్టంగా మారుతోందని వారు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం నిధులు సమకూర్చడం, భక్తులకు సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలపై ధర్మకర్తలు దృష్టి పెట్టాలని అర్చకులు సూచించారు. దేవాలయాలు ఉపాధి కేంద్రాలు కావు. భక్తుల ఆధ్యాత్మిక కేంద్రమే. దీన్ని గమనించాలని వారు అన్నారు. చట్టపరంగా కూడా ధర్మకర్తలు, చైర్మన్లు ఆలయ నిర్వహణలో నేరుగా జోక్యం చేసుకోవడానికి అధికారం లేదని వారు గుర్తుచేశారు. చట్టం చెబుతున్నదని స్పష్టమే ధర్మకర్తలు అభివృద్ధిని పర్యవేక్షించాలి కానీ అర్చకుల విధుల్లో జోక్యం చేసుకోరాదు. దీన్ని విస్మరించి ప్రవర్తిస్తే అది భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్య అవుతుందని అర్చకులు వివరించారు. ఇక ఆలయ సిబ్బందిలోనూ భయాందోళన నెలకొంటోందని సమాచారం. ఇలాగే కొనసాగితే ఆలయ వాతావరణం చెడిపోతుంది. తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం దెబ్బతింటుంది" అని పెద్దవారు వ్యాఖ్యానించారు. భక్తులు కూడా ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మల్లికార్జున స్వామి ఆలయం ఆధ్యాత్మిక శక్తికి ప్రతీక. ఇలాంటి వివాదాలు భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. దేవాలయం శాంతి, సేవల కేంద్రంగా ఉండాలి, రాజకీయ వేదికగా కాదని భక్తులు అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర స్థాయిలో కూడా ఈ వివాదం చర్చనీయాంశమవుతోంది. ఆలయ వ్యవహారాల్లో అర్చకుల మనోభావాలను గౌరవించకపోతే పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేసే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. భక్తుల మనోభావాలే మా శ్రీరామరక్ష. భక్తులకు సేవ చేయడమే మా ధర్మం అని అర్చకులు స్పష్టం చేశారు. ఇక భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా అధికారులు, ఆలయ చైర్మన్, ట్రస్ట్ బోర్డు సభ్యులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆలయ పరిరక్షణ, భక్తుల సౌకర్యాలే ప్రధాన కర్తవ్యమని, రాజకీయ లేదా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆలయాన్ని వేదికగా మార్చకూడదని సూచించారు. అర్చకులు మరోసారి ధర్మకర్తల మండలికి హెచ్చరిక జారీ చేస్తూ ఇకపై పూజారుల విధుల్లో జోక్యం చేసుకోవద్దు. మా మనోభావాలు దెబ్బతింటే రాష్ట్రవ్యాప్తంగా చర్చ పెట్టాల్సి వస్తుంది. మేము మౌనం పాటించడం బలహీనత కాదు, భక్తుల కోసం సహనం చూపిస్తున్నాం అని స్పష్టం చేశారు. ఈ సంఘటనతో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని భక్తుల మధ్య చర్చ చెలరేగింది. ఒకవైపు ఆలయ గౌరవాన్ని కాపాడాలని అర్చకులు ప్రయత్నిస్తుండగా, మరోవైపు ధర్మకర్తల ప్రవర్తనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిస్థితి మరింత క్లిష్టమవకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణం జోక్యం చేసుకోవాలని భక్తులు కోరుతున్నారు. మల్లికార్జున స్వామి ఆలయం సాంప్రదాయం, విశ్వాసం, భక్తి ప్రతీకగా నిలవాలని అందరి ఆకాంక్ష. భక్తుల పుణ్యమే ఆలయ అభివృద్ధికి మూలం అని అర్చకులు చివరగా పేర్కొన్నారు.



# విద్యార్థులు, ఉపాధ్యాయులకు సీపీఆర్, అవగాహన


పెద్దపల్లిటౌన్,అక్టోబర్17(ఆకాంక్ష) : స్థానిక జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం పెద్దపల్లి 108 సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు సీపీఆర్ (కార్డియోపల్మనరీ రిససిటేషన్) విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 108 పెద్దపల్లి జిల్లా ఇంచార్జీ కుమారస్వామి 108 సిబ్బంది పడిదం కుమార్ నూనె దేవేందర్ సీపీఆర్ చేసే విధానాన్ని డెమో ద్వారా వివరించారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది కుమార్ దేవేందర్ మాట్లాడుతూ... గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్ పై అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమని సిపిఆర్ ఎలా చేయాలనే దానిపై డెమో ద్వారా చేసి చూపించడం జరిగిందన్నారు.అనంతరం పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను 108 సిబ్బంది వివరించారు. పొగాకు వల్ల క్యాన్సర్, టీబీ వంటి అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయని, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. మానసిక ఆరోగ్య రుగ్మతలు, వాటి నివారణ మార్గాలపై కూడా 108 సిబ్బంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు అర్థమయ్యే రీతిలో వివరణాత్మక ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# బీసీ బంద్ విజయవంతం చేయాలి

## - టీ ఆర్ పి నాయకుల పిలుపు

పెద్దపల్లిటౌన్,అక్టోబర్17(ఆకాంక్ష) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఇచ్చిన రాష్ట్ర బీసీ బందును విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండవేన స్వామి ప్రజలకు పిలుపునిచ్చారు. తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త బందులో భాగంగా జిల్లాలో బీసీ సంఘాలు, మేధావులు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, కార్మిక, కర్షక, విద్యార్థి, ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బీసీల సత్తాను చాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి 42 శాతం రిజర్వేషన్లు సాధించుకుందామని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు కాసిపేట ఉదయ్, నాయకులు అడ్డూరి గంగారం, నాంపల్లి శివదాస్, బొప్పు జాషువా, ఉమ్మల రాజేందర్, పోలుదాసరి రాజయ్య, రాజశేఖర్, భూపెల్లి ప్రసాద్, కాంపల్లి మారుతి, ఇందారపు రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ బంద్ విజయవంతం చేయండి

జగిత్యాల,అక్టోబర్ 17(ఆకాంక్ష): బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్ (బంద్ పర్ జస్టిస్) కు జగిత్యాల జిల్లా విద్యార్థి సంఘాల జేఏసీ మద్దతు తెలిపారు.శుక్రవారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కూర్మాచలం ఉమా మహేష్ మాట్లాడుతూ.... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీ.సీ లకు న్యాయమైన వాటా దక్కేలా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. 42% రిజర్వేషన్ ల సాధనైకే బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ లో అన్ని వర్గాలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వాలు మారిన బీసీ ల బతుకులు మారటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.బంద్ కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాజాల రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండి అక్రమాలిక్,బుగ్గారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యకుడు సిగిరి అంజిత్ కుమార్,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ప్రాణరక్షణ స్ఫూర్తి

## - సీపీఆర్ అవగాహన కార్యక్రమం ఆకర్షణ




రాజన్న సిరిసిల్ల(ఆకాంక్ష) : మనిషి ప్రాణం విలువైనది... ఆ ప్రాణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరికి అవసరమైన అవగాహన కలగాలి. ఈ భావంతో సిరిసిల్ల పట్టణంలో సీపీఆర్ ప్రాధాన్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సీపీఆర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా 108 అంబులెన్స్ సేవా సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గీతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దూరు గురుకుల పాఠశాలలో ఈ అవగాహన శిబిరం నిర్వహించగా, డాక్టర్ ఆముక్త, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ బానుజ పర్యవేక్షణలో విద్యార్థులకు సీపీఆర్ ప్రక్రియపై సమగ్ర శిక్షణ ఇచ్చారు. గుండె ఆగిపోయిన వ్యక్తికి తక్షణ సహాయం ఎలా అందించాలి కృత్రిమ శ్వాస ఇవ్వడం, ఛాతీపై ఒత్తిడి పద్ధతి, అత్యవసర సమయాల్లో 108కి కాల్ చేయడం వంటి అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ... ఆకస్మిక గుండెపోటు, ఊపిరితిత్తుల సమస్యలు, షాక్ లేదా ప్రమాదాల వంటి పరిస్థితుల్లో సీపీఆర్ పద్ధతి బాధితుడి ప్రాణాలను కాపాడే కీలక ప్రక్రియ అని తెలిపారు. ప్రథమ చికిత్స పద్ధతులు తెలుసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు.సమయానికి సరైన చర్యలు తీసుకుంటే ప్రాణాలను కాపాడగలమని విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షణ విద్యార్థుల్లో సేవాభావం, ప్రాణరక్షణ స్ఫూర్తిని పెంపొందిస్తుందని తెలిపారు. అత్యవసర సమయాల్లో తక్షణ సహాయం చేయగల నైపుణ్యాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని సీపీఆర్ పద్ధతిని నేర్చుకున్నారు. ప్రాణరక్షణ అవగాహనలో ముందడుగు వేసిన 108 సిబ్బంది, వైద్య బృందం సేవాభావాన్ని స్థానికులు ప్రశంసించారు. యువతలో ప్రాణాలను కాపాడే చైతన్యాన్ని నింపిన ఈ కార్యక్రమం సిరిసిల్లలో విశేష ఆదరణ పొందింది.

# వేములవాడలో రైతులకు ఉచిత కోడెల పంపిణీ

వేములవాడ,అక్టోబర్17(ఆకాంక్ష) : రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ గ్రామంలో ఉన్న శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో శనివారం రోజు విశిష్ట కార్యక్రమం జరిగింది. భక్తి, సాంస్కృతిక పరంపర కలగలిసి ఉన్న ఆధ్యాత్మిక వాతావరణంలో రైతులకు ఉచితంగా కోడెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రైతులకు స్వయంగా కోడెలను అందజేశారు.ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ...దేశ వ్యాప్తంగా ఎక్కడా లేని ప్రత్యేక సంప్రదాయం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో ఉన్నదని పేర్కొన్నారు. భక్తులు మొక్కులు చెల్లించేటప్పుడు స్వామి వారికి కోడెను కట్టడం అనేది భక్తిశ్రద్ధల ప్రతీకగా మారిందన్నారు. ఈ పవిత్ర కోడెలు రైతులకు ఉచితంగా అందించడం ద్వారా వ్యవసాయంలో ఉపయోగపడేలా చేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఆది శ్రీనివాస్ వివరించారు. గోశాలలో పెంచిన కోడెలను ఆరోగ్యంగా ఉంచి, వాటిని అర్హులైన రైతులకు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. రైతులు ఈ కోడెలను సద్వినియోగం చేసుకోవాలని, వాటిని వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలనే సూచించారు. కోడెలను ఇతర అవసరాలకు వాడినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, వేములవాడలో 40 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక సదుపాయాలతో కూడిన సువిశాల గోశాల నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందని తెలిపారు. ఇప్పటికే అనుకూలమైన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలో నిర్మాణ పనులు మొదలవుతాయని వెల్లడించారు.రాజన్న స్వామి వారికి మొక్కులు చెల్లించే భక్తులు పాలు మరిచిన తర్వాత ఆ కోడెలను గోశాలకు అందజేయాలని కోరారు. ఇది భక్తుల విశ్వాసాన్ని, ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా ఉండే కార్యక్రమమని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, దేవస్థానం అధికారులు, రైతు సంఘాల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన హెచ్ ఆర్ సి ఐ పోరాటం

## జాతీయ అవార్డు గ్రహీత రాజేందర్ కుమార్



పెద్దపల్లిటౌన్,అక్టోబర్(17) : ప్రజల పక్షాన వారి హక్కుల కోసం పోరాటం చేసేందుకే హెచ్ ఆర్ సి ఐ స్థాపించి దిగ్విజయంగా కొనసాగిస్తున్నట్లు జాతీయ అవార్డు గ్రహీత, హెచ్ ఆర్ సి ఐ జిల్లా అధ్యక్షులు కొండల రాజేందర్ కుమార్ అన్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా 3 వ వార్షికోత్సవ సభ సందర్భంగా పెద్దపల్లి జిల్లా తరఫున పలువురికి బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డులు అందుకోవడం చాలా సంతోషకరమని పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేందర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఆర్సీఐ వ్యవస్థాపకులు జాతీయ చైర్మన్ చెన్నుపాటి శ్రీకాంత్ గతంలో భారత సైన్యంలో పనిచేసిన అనుభవంతో సమాజంలో జరుగుతున్న అన్యాయాలను చూసి ప్రజలకు సామాన్యమైన న్యాయం, కనీసం న్యాయం అందుబాటులో లేకపోవడం, ప్రజలకు తమ హక్కులను గురించి కనీస అవగాహన లేకపోవడం చూసి హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సంస్థను స్థాపించారని పేర్కొన్నారు. మాదాసు చారేంద్ర, మాదాసు నగేష్ సహకారంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సుమారు 8000 మంది సభ్యులతో ఈ సంస్థను మూడు సంవత్సరాలుగా దిగ్విజయంగా నడిపిస్తున్నారని తెలిపారు. హెచ్ఆర్సీఐ సంస్థకు అనుబంధంగా క్రౌన్ హ్యూమన్ రైట్స్ దినపత్రికను స్థాపించి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పట్ల గళం విప్పడానికి నిత్యం విలేకరులతో అందుబాటులోకి యాప్ ను తీసుకురావడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్సీఐ అడిషనల్ జనరల్ సెక్రెటరీ బొంకూరి కైలాసం, క్రౌన్ హ్యూమన్ రైట్స్ దినపత్రిక తెలంగాణ సబ్ ఎడిటర్ బోయిని ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఆర్గనైజేషన్ సెక్రటరీ శ్రీనివాస్, ఆర్గనైజేషన్ సెక్రటరీ లింగమూర్తి, జాగటి శాంతమ్మ, ఆరే లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.




# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఫారెస్ట్ అధికారుల సత్తా

## - 2.12 లక్షల విలువైన టేకు దిమ్మల స్వాధీనం

భద్రాద్రి కొత్తగూడెం,అక్టోబర్17(ఆకాంక్ష): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల ప్రాంతంలో అర్ధరాత్రి అరణ్యవాసాన్ని తలపించే ఆపరేషన్‌లో ఫారెస్ట్ అధికారులు భారీ టేకు స్మగ్లింగ్‌ను భద్రపరిచారు. చర్ల పరిధిలోని గోదావరి పాయింట్ సరిహద్దు వద్ద చతీస్గఢ్ రాష్ట్రం మజ్జూర్ కొత్తపల్లి ప్రాంతం నుండి అక్రమంగా తరలిస్తున్న టేకు దిమ్మలను ఫారెస్ట్ సిబ్బంది పట్టుకున్నారు.వివరాల ప్రకారం...చర్ల రేంజ్ ఫారెస్ట్ అధికారి రాజేష్ ఆధ్వర్యంలో బీట్ ఆఫీసర్ బాలాజీ, సిబ్బంది కలసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.పక్క నిఘా సమాచారంతో గోదావరి పాయింట్ సమీపంలో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేయగా, అందులో భారీ మొత్తంలో టేకు దిమ్మలు దాచినట్లు తేలింది. సుమారు రెండు లక్షల పన్నెండు వేల రూపాయల విలువైన ఈ టేకు దిమ్మలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.ట్రాక్టర్‌ను సీజ్ చేసి చర్ల ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎఫ్ఎస్ఓ రాజేష్ తెలిపారు. అక్రమంగా టేకు తరలిస్తున్న వ్యక్తులు అరణ్య సంపదను దోచుకుంటున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.అక్రమ కలప రవాణాపై గత కొన్ని వారాలుగా ఫారెస్ట్ అధికారులు కఠిన నిఘా కొనసాగిస్తున్నారు. అటవీ సంపదను కాపాడే బాధ్యత ప్రతి పౌరుడిదని, ఇలాంటి దోపిడీని వెంటనే అధికారులకు తెలియజేయాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ అన్వేషిక ప్రయోగదర్శిని



పెద్దపల్లిటౌన్,అక్టోబర్17(ఆకాంక్ష) : విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ, పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అన్వేషిక ప్రయోగదర్శినిని ప్రవేశపెట్టిందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఎస్సీఈఆర్టీ రూపొందించిన ఈ ల్యాబ్ మాన్యువల్ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కొత్త దిశ చూపనుంది.6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఉపయోగపడేలా ఈ ప్రయోగదర్శిని రూపుదిద్దుకుంది. పాఠ్యపుస్తకాలలోని అంశాలను ఆధారంగా చేసుకుని విద్యార్థులు స్వయంగా పరిశీలన, ప్రయోగాల ద్వారా నేర్చుకునే విధంగా మాన్యువల్ రూపొందించడం విశేషం.ఈ పుస్తకాల రచనలో రాష్ట్రవ్యాప్తంగా 32 మంది సబ్జెక్ట్ నిపుణులు పాల్గొన్నారు. అందులో పెద్దపల్లి జిల్లా పత్తిపాక ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్. కృష్ణ మోహన మూర్తి కీలక పాత్ర పోషించారు. ఆయన జీవశాస్త్ర విభాగంలో పాఠ్యపుస్తకంలోని ప్రయోగశాల కృత్యాలను మరింత సులభంగా అర్థమయ్యేలా రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు నిర్వహించి, శాస్త్రీయ సూత్రాలను గ్రహించేలా వీటిని రూపొందించామని ఆయన పేర్కొన్నారు.దశలవారీగా అన్ని జిల్లాల ప్రభుత్వ పాఠశాలలకు ఈ ప్రయోగదర్శిని పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఈ ప్రయత్నం ద్వారా విద్యార్థుల్లో జిజ్ఞాసా దృక్పథం పెరిగి, శాస్త్రీయ ఆలోచన పటిష్టమవుతుందని నిపుణులు భావిస్తున్నారు.రాష్ట్ర స్థాయిలో రూపొందిన ఈ అన్వేషిక ప్రయోగదర్శిని ద్వారా తెలంగాణ ప్రభుత్వ విద్యా విధానం మరోసారి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తుందనే అభిప్రాయం ఉపాధ్యాయ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

# బీసీ-ఏ రిజర్వేషన్లపై జేఏసీ సమావేశం

హనుమకొండ, అక్టోబర్ 17 (ఆకాంక్ష): గంగాగార్డెన్, కాకతీయ కాలనీలో బీసీ –ఏ కులాల రిజర్వేషన్, కులవృత్తుల పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. బీసీ–ఏ కుల వృత్తులను ముదిరాజ్ కులస్తులు ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తూ, బీసీ–ఏ కులాలు ఐక్యంగా ఉద్యమించాలని నిర్ణయం తీసుకున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల మద్దతుగా శనివారం కలెక్టరేట్ ముందు జరగనున్న బంద్‌ను విజయవంతం చేయాలని తీర్మానించారు. సమావేశంలో చైర్మన్ పిల్లి రాజమౌళి, వైస్ చైర్మన్‌లు పాక ఓంప్రకాశ్, పల్లి తులసి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# మరణం అనేది అంతిమం కాదు

## - అది ఇంకొకరి జీవితానికి ఆరంభం

## - మరణంలోను ఆరుగురికి పునర్జన్మ ఇచ్చిన యువకుడు



మెదక్,అక్టోబర్17(ఆకాంక్ష) : మెదక్ జిల్లా అల్లాదుర్గ మండలంలోని చేవెళ్ల గ్రామానికి చెందిన యువకుడు శ్రీకాంత్ తన మరణంతో ఆరుగురికి పునర్జన్మ ఇచ్చి మానవత్వానికి నిదర్శనంగా నిలిచాడు. ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైన విషయం తెలిసిందే. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా, ఆయన తొమ్మిది రోజుల పాటు మృత్యువుతో పోరాడి చివరికి ప్రాణాలను విడిచాడు.తీవ్రమైన మెదడు గాయాల కారణంగా వైద్యులు శ్రీకాంత్ బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు ఎంతో మనసు నొప్పించుకునే నిర్ణయం తీసుకున్నారు. ఆయన అవయవాలను దానం చేయాలని నిర్ణయించి ఆసుపత్రి అధికారులకు సమాచారం అందించారు. వైద్యుల సహకారంతో అవయవదానం ప్రక్రియ పూర్తయింది.శ్రీకాంత్ యొక్క గుండె, కళ్ళు, కాలేయం, కిడ్నీలు వంటి ముఖ్య అవయవాలు అవసరమున్న రోగులకు చేరాయి. ఈ చర్యతో మరో ఆరుగురికి కొత్త జీవం లభించింది. ఒకే కుటుంబం నుంచి వచ్చిన ఈ త్యాగం ప్రాంతమంతా కరుణ, కృతజ్ఞతల వాతావరణం నెలకొల్పింది.అల్లాదుర్గ పరిసరాల్లోని ప్రజలు శ్రీకాంత్ కుటుంబాన్ని మానవత్వానికి ప్రతీకగా కొనియాడుతున్నారు.తమ కుమారుడు బ్రతకకపోయినా, ఆయన అవయవాలు మరో ఆరుగురి శరీరాల్లో సజీవంగా ఉండబోతున్నాయని కుటుంబ సభ్యులు భావోద్వేగంతో తెలిపారు.స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్యులు, సామాజిక సేవకులు శ్రీకాంత్ కుటుంబాన్ని అభినందిస్తూ అవయవదానానికి ప్రేరణగా నిలిచారని ప్రశంసించారు. అవయవదానం పై అవగాహన పెరగాలని, ఇలాంటి స్ఫూర్తిదాయక ఉదాహరణలు మరెన్నో రావాలని వారు ఆకాంక్షించారు.శ్రీకాంత్ చేసిన ఈ త్యాగం మెదక్ జిల్లా ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా మారింది. మరణం అనేది అంతిమం కాదు ు అది ఇంకొకరి జీవితానికి ఆరంభం" అని చెప్పే సత్యాన్ని మరోసారి సాక్షాత్కరించిన సంఘటనగా ఈ ఘటన నిలిచిపోయింది.

# సాక్షి కార్యాలయంపై దాడిని ఖండిస్తూ సిరిసిల్లలో జర్నలిస్టుల నిరసన

## - భావ ప్రకటనా స్వేచ్ఛను అడ్డుకోవొద్దు.. పత్రికా హక్కులను కాపాడండి




రాజన్న సిరిసిల్ల,అక్టోబర్ 17(ఆకాంక్ష) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాక్షి దినపత్రిక కార్యాలయంపై పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తూ, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. శుక్రవారం జిల్లా జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో విలేకరులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కార్యాలయం వరకు నినాదాలతో మోగించారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించి, పత్రికా స్వేచ్ఛను అణచివేసే ప్రభుత్వ వైఖరిని నిలదీశారు.ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ... జర్నలిజం అనేది ప్రజల వాణి. సమాజంలోని వాస్తవాలను వెలుగులోకి తేవడమే మా బాధ్యత. అలాంటి దినపత్రికపై పోలీసులు దాడి చేయడం, వార్తల మూలాలు చెప్పమని ఒత్తిడి చేయడం పత్రికా రంగంపై నేరుగా దాడి చేసినట్టే అని విమర్శించారు. ఈ చర్యల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావ ప్రకటనా స్వేచ్ఛను అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకుందని వారు ఆరోపించారు.ప్రజలకు నిజాలు తెలియకుండా, పత్రికలను భయపెట్టి మూగబోయే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని జర్నలిస్టు సంఘాల నేతలు మండిపడ్డారు. పత్రికా రంగం ప్రజల హక్కుల కోసం, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తుందని గుర్తు చేశారు. ప్రభుత్వం జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత వహించాలి గాని, వారిని భయపెట్టడం తగదని వారు సూచించారు.అదేవిధంగా ఇకనైనా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలి. పత్రికలపై, జర్నలిస్టులపై దుందుడుకు చర్యలు ఆపాలి. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలను మరింత ఉధృతం చేస్తాం అని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా జర్నలిస్టు సంఘ అధ్యక్షుడు,కార్యదర్శి,సభ్యులు,పలు మీడియాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. జర్నలిస్టులు స్వేచ్ఛగా వార్తలు రాయడానికి, ప్రజల సమస్యలను వెలుగులోకి తేవడానికి ఎవరూ అడ్డంకులు సృష్టించకూడదని వారు గట్టిగా డిమాండ్ చేశారు.పత్రికా స్వేచ్ఛ అంటే ప్రజల స్వరమే. దాన్ని అణగదొక్కడం అంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడం అని పేర్కొన్నారు. సిరిసిల్లలోని నిరసన కార్యక్రమం కొద్ది సేపు నగరంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొల్పింది. పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

# బీసీ సంఘాల బంద్‌కు మద్దతుగా పుట్ట మధూకర్ పిలుపు



మంథని,అక్టోబర్ 17 (ఆకాంక్ష) : బీసీల హక్కుల సాధన కోసం బీసీ సంఘాలు ఇచ్చిన రాష్ట్ర వ్యాప్తంగా బంద్ పిలుపుకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మద్దతు తెలిపారు. ఈ నెల 18న శనివారం జరుగనున్న బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన పుట్ట మధూకర్ మాట్లాడుతూ, బీసీలకు రాజ్యాధికారంలో, విద్యా, ఉద్యోగాలలో సముచిత వాటా రావడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. బీసీల హక్కుల కోసం బీసీ సంఘాలు చేస్తున్న పోరాటం సమాజం మొత్తానికి న్యాయం సాధించే దిశగా ఉన్నదని అన్నారు. ఈ బంద్ ద్వారా ప్రభుత్వం బీసీల డిమాండ్లను గమనించి, వారికి న్యాయం చేసే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మంథని నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, పట్టణం, వ్యాపార వర్గాలు, విద్యార్థులు, యువత, మహిళలు బంద్‌కు సంఘీభావం తెలుపాలని పిలుపునిచ్చారు. బంద్‌ను శాంతియుతంగా, గాంధేయ మార్గంలో నిర్వహించాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు బీసీ సంఘాల పిలుపుకు మద్దతుగా విస్తృతంగా పాల్గొని బంద్‌ను ఘనవిజయం చేయాలని ఆయన కోరారు.బీసీలకు రాజకీయ హక్కులు, విద్యా, ఉపాధి అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో జరుగుతున్న ఈ బంద్ ప్రజల ఆత్మగౌరవ పోరాటమని మధూకర్ పేర్కొన్నారు. బీసీల న్యాయపరమైన కోరిక నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. మంథని పరిధిలోని అన్ని వర్గాల ప్రజలు ఈ బంద్‌లో పాల్గొని బీసీల సంకల్పానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.


# 42 శాతం రిజర్వేషన్ కోసం జస్టిస్ ఫర్ బంద్ కు బిఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు

## - మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి



పెద్దపల్లిటౌన్,అక్టోబర్ 17(ఆకాంక్ష) : విద్య ఉద్యోగాలతో పాటు రాజకీయ పదవుల్లో కూడా 42 శాతం రిజర్వేషన్లు కావాలని ఏదైతే పోరాటం చేస్తున్నారో ఆ పోరాట సాధన కొరకు బీసీ బిడ్డల జేఏసీ 18 వ తారీఖున తలపెట్టిన జస్టిస్ ఫర్ బంద్ కు బిఆర్ఎస్ పార్టీ పక్షాన పూర్తి సహకారం ఉంటుందని, పెద్దపల్లి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ రేపు బీసీ సంఘాలు తల పెట్టిన జస్టిస్ ఫర్ బందులో %దీ=ా% పార్టీ శ్రేణులు పాల్గొని బందు విజయవంతం చేయడంలో పాత్ర వహిస్తారని తెలిపారు. ఈ బంద్ సందర్భంగా నియోజకవర్గం లోని ప్రతి ఒక్కరు కూడా అనగా వ్యాపార వాణిజ్య వర్గాలు, పాఠశాలలు, కళాశాలలు, దుకాణ సముదాయాలు అన్నీ కూడా బీసీ బిడ్డలు తలపెట్టిన బందుకు మద్దతు తెలుపుతూ బందులో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ వైపు నుండి బీసీ బిడ్డల అభ్యున్నతి ధ్యేయంగా వారు తలపెట్టిన బందుకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ, అదేవిధంగా ఈ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ బిడ్డలను మభ్యపెడుతూ వారిని మోసం చేస్తూ 42 శాతం రిజర్వేషన్ రాజ్యాంగబద్ధంగా సాధించాల్సింది పోయి కేవలం జీవోలు ఇచ్చి మభ్యపెడుతూ ప్రజలను మాయలో ఉంచేటట్టు చేస్తున్నారన్నారు. ఇటువంటి తప్పుడు ఆలోచనలతో టి ఎంతో కాలం బీసీ బిడ్డలను మోసం చేయలేరని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నిజంగా బీసీ బిడ్డలపై కాంగ్రెస్ పార్టీకి ప్రేమ ఉన్నట్లయితే, బీసీల అభ్యున్నతికి, బీసీల జీవితాలలో వెలుగులు నింపేందుకు అవసరమైన బీసీ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టే విషయంలో, రాజ్యాంగబద్ధంగా బీసీ బిల్లు సాధించే విషయంలో తమ కర్తవ్యం కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు పూర్తి చేయాలని పేర్కొన్నారు. అప్పుడే బీసీ బిడ్డలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందన్నారు. బీసీ బిల్లు సాధించే విషయంలో చేయాల్సిన ప్రకారంగా చేయకుండా కాంగ్రెస్ పార్టీ బీసీలను మభ్యపెట్టి, కాలం వెళ్లదీసే ఆలోచన చేస్తున్నందున దానిని తీవ్రంగా ఖండిస్తూ, రేపటి జస్టిస్ ఫర్ బందుకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పాత్రికేయ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, నాయకులు సయ్యద్ ముబీన్ఉద్దీన్, పెంచాల శ్రీధర్, ముఖిమ్, బొడ్డుపల్లి రమేష్, ముత్యం లక్ష్మణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# 62 రోజుల తర్వాత ఏడుపాయల వన దుర్గ అమ్మవారికి దర్శన సౌభాగ్యం





మెదక్,అక్టోబర్17(ఆకాంక్ష) : మెదక్ జిల్లాలో అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో ఒకటైన శ్రీ ఏడుపాయల వన దుర్గ మాత ఆలయం వద్ద భక్తులతో హర్షం వెల్లివిరుస్తోంది. వరదలతో గత రెండు నెలలుగా జల దిగ్బంధంలో ఉన్న అమ్మవారికి నేటి శుక్రవారం నుండి మళ్లీ దర్శన సౌభాగ్యం లభించింది.ఎగువ ప్రాంతాల్లో కురిసిన అతి భారీ వర్షాల కారణంగా సింగూరు ప్రాజెక్టు నిండి పోవడంతో మంజీరా నది ద్వారా నీరు నిజాంసాగర్ వైపు ప్రవహించింది. దాంతో ఏడుపాయల ఆలయం పరిసర ప్రాంతాలు సుమారు 200 టీఎంసీల నీటి ప్రవాహం కారణంగా పూర్తిగా మునిగిపోయాయి. గర్భగుడి వరకు నీరు చేరడంతో అమ్మవారి ఆలయ ద్వారాలు మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో భక్తులు 62 రోజుల పాటు అమ్మవారిని దర్శించుకోలేకపోయారు. అయితే, గత కొన్ని రోజులుగా వరద నీరు తగ్గడంతో ఆలయ పరిసరాలు తిరిగి భక్తులతో కళకళలాడుతున్నాయి. ఉదయం ఆలయాన్ని పూర్తిగా శుభ్రపరిచి,గర్భగుడిలో పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఎండోమెంట్స్ ఈవో చంద్రశేఖర్ తెలిపారు.వారి ప్రకారం, అమ్మవారికి అభిషేకం అనంతరం అలంకారం చేసి, భక్తులకు దర్శనం కల్పించామని, రేపటి నుండి సాధారణంగా పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో శుభ్రపరిచే పనుల్లో ఆలయ సిబ్బంది, స్థానిక భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారని తెలిపారు. మరోవైపు, దర్శనాలు తిరిగి ప్రారంభమైన విషయం తెలుసుకున్న వేలాది మంది భక్తులు తొలిసారిగా అమ్మవారిని దర్శించుకోవడానికి ఏడుపాయల వైపు తరలివెళ్తున్నారు. ఉదయం నుంచే భక్తుల రద్దీ పెరగడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో పోలీసులు రక్షణ ఏర్పాట్లు చేశారు.ఎక్కువ రోజులు జల దిగ్బంధంలో ఉన్న అమ్మవారి ఆలయం ఇప్పుడు మరలా తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంది.గర్భగుడిలో వాతావరణం మార్పులతో కూడిన సువాసన, పూలతో చేసిన అలంకరణ భక్తుల మనసులను హత్తుకుంటోంది.ఈ ఏడాది వరదలు చాలా భారీగా వచ్చాయి. ఇంతకాలం ఆలయం నీటిలో మునిగిపోయిన సందర్భం అరుదుగా జరిగింది. అమ్మవారు తిరిగి దర్శనమిచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.అలాగే, ఆలయానికి వచ్చే రహదారులను పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. శానిటేషన్ సిబ్బంది కూడా రోజంతా శుభ్రపరిచే పనుల్లో నిమగ్నమయ్యారు. ఎండోమెంట్ శాఖ అధికారులు, పూజారులు భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు సమన్వయంగా కృషి చేస్తున్నారు. మొత్తం మీద, 62 రోజుల తర్వాత మళ్లీ శ్రీ ఏడుపాయల వన దుర్గ మాత దర్శనం భక్తులలో అపార ఆనందాన్ని కలిగించింది. అమ్మవారి ఆలయం చుట్టూ మళ్లీ భక్తి తరంగాలు ఉప్పొంగుతున్నాయి.

# వేములవాడలో బీసీ బంద్‌కు సీపీఎం పార్టీ మద్దతు

## - బీజేపీ మొండి వైఖరిని ఎండగడదాం: సీపీఎం నాయకుల పిలుపు.




వేములవాడ,అక్టోబర్ 17 (ఆకాంక్ష): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో బీసీ సంఘాలు రేపు, అక్టోబర్ 18న నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌కు సీపీఎం పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. వేములవాడ డివిజన్ సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో పార్టీ నాయకులు ఈ మేరకు ప్రకటించారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ, బీసీలకు తగిన న్యాయం చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో చట్టం చేయకుండా, మాటలకే పరిమితమవుతున్న బీజేపీ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. బీసీ హక్కుల కోసం చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాల్సిన బదులు, బీజేపీ నాయకులు చోద్యం చూస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం అని వారు మండిపడ్డారు.బీసీ రిజర్వేషన్ల బిల్లును వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టంగా చేయాలని, ఆ చట్టాన్ని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని సీపీఎం డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని ఇక ఆలస్యం చేయకూడదని వారు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలు, ప్రజలు రేపటి బంద్‌ను విజయవంతం చేయాలని, బీసీ హక్కుల కోసం ఐక్యంగా నిలవాలని సీపీఎం పిలుపునిచ్చింది.బీసీలకు హక్కులు ఇవ్వడంలో కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యాన్ని తిప్పికొట్టే సమయం ఆసన్నమైంది. ప్రజలందరూ బంద్ విజయవంతం చేయాలని నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో వేములవాడ డివిజన్ సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమాటి ఎల్లారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ముక్తికాంత అశోక్, గురిజాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. బంద్‌ను సంపూర్ణ విజయవంతం చేయాలని, బీసీ ప్రజల ఐక్యతతోనే రిజర్వేషన్ల సాధన సాధ్యమవుతుందని వారు అభిప్రాయపడ్డారు.బీసీ సంఘాల పిలుపుతో రేపటి బంద్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రజా ప్రయోజనాల కోసం జరుగుతున్న ఈ పోరాటంలో భాగస్వాములవ్వాలని కోరారు.

# బీసీ జేఏసీ చేపట్టిన బంద్ ఫర్ జస్టిస్ రాష్ట్ర బంద్ కు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు

## - బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు వ్యతిరేకంగా ఉన్న బిజెపిని గద్దె దింపాలి

## - ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



గోదావరిఖని,అక్టోబర్ 17,(ఆకాంక్ష): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బిజెపిని గద్దదింపాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు.రిజర్వేషన్ల సాధనకు వివిధ బీసీ సంఘాలతో ఏర్పడిన బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ బంద్ ఫర్ జస్టిస్ పేరుతో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్ కు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని బందులో ప్రత్యక్షంగా పెద్దపెల్లి జిల్లా వ్యాప్తంగా పాల్గొంటామని తెలిపారు.బీసీ రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహా లోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు.బీసీ బిల్లులను ఆమోదించి రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైన ఉన్నదని స్పష్టం చేశారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణ మీద ఉన్న హైకోర్టు స్టే విధించడంతో రిజర్వేషన్ల అమలు స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనని ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపీలు ,కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహించి బీసీలకు 42% రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపించిన స్పందించలేదన్నారు. శాసనసభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్కు పంపించిన ఆమోదించకపోవడం వల్లే రిజర్వేషన్లు ఆగిపోయాయి అని అన్నారు.బిజెపి కులతత్వ, మతోన్మాద పార్టీ అయినందున కుల వ్యవస్థ అసమానతలు ఉండాలని మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుకుంటుందని ఆరోపించారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు రావలసిన హక్కులన్నింటిని కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు.బీసీల పట్ల బిజెపికి చిత్తశుద్ధి ఉంటే తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా అవసరమైతే కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటును సమావేశపరిచి ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రిజర్వేషన్లు 50% పరిమితి పేరుతో ఏళ్ల తరబడి బీసీల రిజర్వేషన్ పెంపు అంశాన్ని నాన్చడం ఏమాత్రం తగదన్నారు.ఆర్థికంగా వెనకబడిన వర్గాల ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వర్తింపులో ఈ పరిమితిని ఇప్పటికీ దాటిపోయిన విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు.గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉన్న బిల్లులు నిర్ణీత కాలపరిమితిలోగా ఆమోదం లభించకపోతే నోటిపై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలన్నారు.రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి కేంద్రమంత్రులు,ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదన్నారు.కేంద్రంలో అధికారంలో బిజెపి ఉండడం వల్లనే ఈరోజు ఈ రిజర్వేషన్లు అమలు కాని పరిస్థితి ఏర్పడిందని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో కేంద్రంలో బిజెపిని భూస్థాపితం చేయాలని అన్నారు.

# ఏసీబీ వలలో.. కమర్షియల్ తిమింగళం..!


## - నగదుతో పట్టుబడ్డ ఉద్యోగి..వాణిజ్య శాఖలో అలజడి



విజయవాడ.అక్టోబర్17(ఆకాంక్ష) : కమర్షియల్ ట్యాక్స్ శాఖలో ఏళ్లుగా పాతుకుపోయిన అవినీతి తిమింగళాన్ని ఏసీబీ అధికారులు గురువారం సాయంత్రం వలపన్ని పట్టుకున్నారు. కొండపల్లి శ్రీనివాస్ తరచూ వ్యాపారులను బెదిరిస్తూ.. వారి వద్ద నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులకు గతంలో అనేక మార్లు ఫిర్యాదులు అందాయి. పలు సందర్భాల్లో అతను ఏసీబీ అధికారులకు చిక్కినట్లే చిక్కి తృటిలో తప్పించుకున్నాడు. ఈ నేపథ్యంలోనే సర్కిల్ ఆఫీసుకు సమీపంలోని అవంతి ట్రాన్స్ పోర్ట్ యజమానులను రైడ్ల సాకుగా వేధించి వేలల్లో నగదును వసూలు చేస్తుండగా కచ్చితమైన సమాచారంతో ఏసీబీ విజయవాడ డీఎస్పీ సుబ్బారావు ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ బృందాలు వలపన్ని పట్టుకున్నాయి.అతని వద్దనుంచి 15 వేల నగదును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు, రసాయనిక పరీక్ష ద్వారా అవినీతి వసూళ్లకు పాల్పడుతున్నట్లు నిర్ధారించారు. వివిధ చోట్లకు వసూళ్ల నిమిత్తం తీసుకెళ్లే వాహనాన్ని సైతం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి తమ అధీనంలోకి తీసుకున్నారు. గతంలో కూడా నిందితుడు ఇదే తరహా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ 2017 ప్రాంతంలో ఏసీబీ అధికారులకు పట్టుబడి.. ఏడాది పాటు సస్పెన్షన్ వేటుకు గురైన్నపటికి, ఏ మాత్రం మార్పు రాకపోవడంపై సహచర ఉద్యోగులు పలు రకాలుగా చర్చించు కుంటున్నారు. గతంలో శాఖాపరమైన చర్యల్లో భాగంగా .. విధినిర్వహణలో భాగంగా గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే పరిమితం కావాలని నగర వ్యవహారాల్లో జోక్యం వద్దని రాత పూర్వకంగా హెచ్చరించినా వైఖరి మార్చు కోవడం లేదని సహోద్యోగులు వాపోతున్నారు. ఆ శాఖలోని కొందరు ఉన్నతాధికారుల రహస్య అందదండలతో కొనసాగుతున్న ఈ అక్రమ వసూళ్లపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో శాఖాపరమైన సమగ్ర విచారణకు ఆదేశిస్తే .. వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే ప్రచారం జరుగుతుంది.చాలా ఏళ్ల తరువాత అక్రమ వసూళ్ల వ్యవహారం ఏసీబీ దాడులతో వెలుగులోకి రావడంతో నగర పరిధిలోని వాణిజ్య పన్నుల శాఖలో గుబులు మొదలైంది.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ హరీష్

వరంగల్, అక్టోబర్ 17 (ఆకాంక్ష): వరంగల్ జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో అవినీతి తిమింగళం బయట పడింది. ఒక సొసైటీ నుంచి లంచం తీసుకుంటూ ఫీల్డ్ ఆఫీసర్ హరీష్ ఏసీబీ అధికారుల చేతికి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. వివరాల్లోకి వెళ్తే... జిల్లాలోని మత్స్యశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ హరీష్, ఒక ఫిషరీస్ సొసైటీకి సంబంధించిన పనిని సులభతరం చేయడానికి రూ.75,000 లంచం కోరినట్టు సమాచారం.సంబంధిత సొసైటీ ప్రతినిధులు ఈ వ్యవహారంపై అసంతృప్తి వ్యక్తం చేసి, వెంటనే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, హరీష్ ను చాకచక్యంగా పట్టుకున్నారు.సొసైటీ ప్రతినిధుల నుంచి డబ్బులు స్వీకరిస్తున్న సమయంలోనే ఏసీబీ అధికారులు దాడి చేసి, అతడిని పట్టుకున్నారు.అధికారులు అంతలోనే లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తులో హరీష్ జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి ఆదేశాల మేరకే ఈ డబ్బు డిమాండ్ చేసినట్టు ఏసీబీ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ బృందం మత్స్యశాఖ కార్యాలయంలో సోదాలు నిర్వహించి, పత్రాలను స్వాధీనం చేసుకుంది.ఈ ఘటనతో మత్స్యశాఖలో కలకలం రేగింది. ఉద్యోగులు ఒకరితో ఒకరు చర్చించుకుంటూ ఇదేనా ప్రజా సేవ అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సొసైటీలకు సాయం చేయాల్సిన అధికారులే లంచాల జాలంలో చిక్కుకోవడం దురదృష్టకరమని ప్రజలు విమర్శలు



గుప్పిస్తున్నారు.జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణిపై కూడా ఏసీబీ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగిస్తోంది. లంచం డిమాండ్‌లో ఆమె పాత్ర ఏమైనా ఉందా, ఆఫీసర్ హరీష్ తరపున ఆమె సూచనలు ఉన్నాయా అన్న కోణాల్లో విచారణ సాగిస్తోంది. హరీష్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేసి, విచారణ కోసం కార్యాలయానికి తరలించారు. ఇదిలా ఉంటే, లంచం తీసుకున్న ఘటనపై మత్స్యశాఖలోని మరికొంత మంది అధికారుల పేర్లు కూడా బయటకు వచ్చే అవకాశముందని ఏసీబీ వర్గాలు సూచిస్తున్నాయి. జిల్లా ప్రజలు మాత్రం ఈ చర్యను స్వాగతిస్తూ, ఇంకా ఇలాంటి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి అంటూ అభిప్రాయపడుతున్నారు.ఏసీబీ ఆధికారులు ఈ వ్యవహారంపై పూర్తి వివరాలను సేకరించి, హరీష్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా చర్యలు ప్రారంభించారు.వరంగల్ జిల్లా పరిపాలనా వర్గాల్లో ఈ ఘటన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# ప్రతిమ హాస్పిటల్ సౌజన్యంతో...ఉచిత మెగా వైద్య శిబిరం




మంథని, అక్టోబర్ 17 (ఆకాంక్ష):మంథని మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో శనివారం ప్రతిమ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక సహకారంతో ఈ వైద్య శిబిరం చేపడుతున్నామని ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ... గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణ దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆ దిశలో ప్రతిమ హాస్పిటల్ వారు ముందుకు వచ్చి ఉచిత వైద్య సేవలు అందించడమే విశేషమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ తరహా శిబిరాలు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.ఈ శిబిరంలో జనరల్ చెకప్, కంటి, దంత, గైనకాలజీ, హార్ట్, డయాబెటిస్, మరియు పిల్లల వైద్య విభాగాల నిపుణులు పాల్గొని ఉచితంగా చికిత్సలు, మందులు అందించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అదనంగా రక్తపోటు, చక్కెర, హీమోగ్లోబిన్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నారు.ఆరెంద, మల్లారం, వెంకటాపూర్, స్వర్ణపెల్లి, నాగే పెల్లి, బట్టుపల్లి, కాన్సాయిపేట్, అడవి సోమనపల్లి వంటి గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకన్న పిలుపునిచ్చారు. వైద్య సిబ్బంది సమన్వయంతో గ్రామ ప్రజలందరికీ నాణ్యమైన సేవలు అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.గ్రామస్థులు ఈ శిబిరం ద్వారా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వైద్య సలహాలు పొందాలని ఆయన కోరారు. ప్రజల ఆరోగ్యం పట్ల మంత్రి శ్రీధర్ బాబు చూపుతున్న శ్రద్ధకు కృతజ్ఞతలు తెలిపారు.వైద్య శిబిరం విజయవంతం కావాలని, ప్రతి కుటుంబం తమ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# కలెక్టరేట్‌లో సిపిఆర్ ఘనంగా అవగాహన కార్యక్రమం





పెద్దపల్లి,అక్టోబర్ 17(ఆకాంక్ష):జీవితాలను రక్షించే అత్యవసర వైద్య పద్ధతులపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం సిపిఆర్ (కార్డియో పల్మనరీ రెసుసిటేషన్) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. వాణిశ్రీ గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య వక్తగా రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంత్ పాల్గొని సిపిఆర్ చేయడం ఎలా అనే అంశంపై ప్రాక్టికల్ డెమోన్స్ట్రేషన్ ఇచ్చారు. గుండె ఆగిపోవడం లేదా శ్వాస ఆడకపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో సాధారణ పౌరుడు కూడా తక్షణ సాయంగా సిపిఆర్ చేయగలగడం ఎంత అవసరమో ఆయన వివరించారు. పాల్గొన్న అధికారులకు స్వయంగా సిపిఆర్ పద్ధతిని ప్రదర్శిస్తూ దశల వారీగా శిక్షణ ఇచ్చారు. అనంతరం హాజరైన వారందరికీ ప్రాణరక్షణకు కట్టుబడి ఉండే ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా డాక్టర్ వాణిశ్రీ మాట్లాడుతూ, “ప్రాణాపాయం కలిగే గుండెపోటు వంటి హఠాత్ ఆరోగ్య సమస్యల నుంచి రక్షించుకోవాలంటే జీవనశైలిలో మార్పులు అత్యవసరం. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి, తక్కువ క్రొవ్వు, తక్కువ ఉప్పు ఉన్న ఆహారం తీసుకోవాలి, బరువు నియంత్రణలో ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా అకస్మాత్తుగా కుప్పకూలినప్పుడు శ్వాస ఉందో లేదో వెంటనే పరిశీలించి, అవసరమైతే సిపిఆర్ ప్రారంభించడం ద్వారా ప్రాణాలు నిలుపుకోవచ్చు. 108కు సమాచారం ఇవ్వడం కూడా అత్యవసరం. ఈ పద్ధతి గురించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండటం సమాజానికి ఎంతో మేలు చేస్తుంది” అని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఆర్. రాజమౌళి, డాక్టర్ కె.వి. సుదాకర్ రెడ్డి, డాక్టర్ బి. కిరణ్ కుమార్, డాక్టర్ నిస్సీ క్రిస్టినా, డాక్టర్ మమతతో పాటు జిల్లా అధికారులు మాధవి, రంగా రెడ్డి, నరేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# యువ ఆవిష్కరణలకు వేదికగా 2.0 ఐడియాథాన్ విజయవంతం



పెద్దపల్లి, అక్టోబర్ 17(ఆకాంక్ష) : తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో నిర్వహించిన “ 2.0 ఫిజికల్ ఐడియాథాన్” పెద్దపల్లి జిల్లాలో ఘనంగా జరిగింది. స్థానిక సమస్యలకు నూతన పరిష్కారాలను ప్రతిపాదించే “వోకల్ ఫర్ లోకల్” థీమ్‌తో ఈ కార్యక్రమం పెద్దపల్లి %టాూఖ% రీజినల్ సెంటర్‌లో జరిగింది.జిల్లాలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కాలేజ్, జేఎన్టీయూ మంథని, మదర్ తెరిసా ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు, ఆర్‌అండ్‌డి కోఆర్డినేటర్లు ఉత్సాహంగా పాల్గొని 45 ఆవిష్కరణాత్మక ఐడియాలను ప్రదర్శించారు. మొత్తం 210 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో యువత చూపిన సృజనాత్మకతను అధికారులు ప్రశంసించారు.ఈ సందర్భంగా %టాూఖ% ప్రాజెక్ట్ మేనేజర్ బాలు ప్రవరఖ్య మాట్లాడుతూ, “స్థానిక ప్రతిభను ప్రోత్సహించడం %టాూఖ% లక్ష్యం. యువత ఆలోచనలను వ్యాపారాలుగా మారుస్తాం” అన్నారు. జిల్లా మేనేజర్ గంగాప్రసాద్ ఐలినేని మాట్లాడుతూ, “యువతలో ఉన్న సత్తాను వెలికి తీసేందుకు %టాూఖ% ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ కౌశల్య, అర్జున్ కుమార్, సంకీర్త్ సీరం (హెల్డ్ హై ఫౌండేషన్), యూనిటీ ఇంజనీరింగ్ కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్, ఆర్‌అండ్‌డి కోఆర్డినేటర్ అశోక్ ప్రభాకర్ పాషా, కాలేజీ %ఫ్టూ%లు పాల్గొన్నారు.





# బీసీల పట్ల బిజెపి, బిఆర్ఎస్ పార్టీల కపట ప్రేమ

## - పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు

పెద్దపల్లి, అక్టోబర్17(ఆకాంక్ష) :బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఈనెల 18న బీసీ సంఘాలు తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్ కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని శుక్రవారం కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బిసి లకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు పెరగాలని బీసీ కుల గణన నిర్వహించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ నినాదంగా పెట్టుకుందని చెప్పారు. 18న జరిగే బందులో పెద్దపెల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని ఆయన తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్ ఆమోదానికి పంపితే తగిన స్పందన రాలేదని తెలిపారు. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో ధర్నా నిర్వహించినప్పటికీ కేంద్రం నుండి ఫలితం శూన్యమని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్ల పెంపు పట్ల ఇష్టం లేదన్నారు. రాష్ట్రానికి సంబంధించిన ఎనిమిది మంది ఎంపీలు, ఇందులో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ బిల్లు ఆమోదానికి గవర్నర్ ను ఒప్పించలేకపోతున్నారని తెలిపారు. బిజెపి తీరు ఇలా ఉండగా, గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి బీఆర్ఎస్ పార్టీ తగ్గించిందని, ప్రస్తుతం ఈ రెండు పార్టీలు బీసీల పట్ల చూపుతున్న కపట ప్రేమను ప్రజలు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, కాల్వశ్రీరాంపూర్ మండల అధ్యక్షులు గజనావేన సదయ్య మరియు ఓదెల మల్లికార్జున స్వామి డైరెక్టర్లు మరియు మార్కెట్ డైరెక్టర్లు మాజీ జడ్పీటీసీ లంక సదయ్య లు, ఎంపీపీ లు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల పై బిజెపి రెండు నాలుకల ధోరణి

## వై.యాకయ్య,జిల్లా కార్యదర్శి







గోదావరిఖని,అక్టోబర్ 17,(ఆకాంక్ష): బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లపై బిజెపి రెండు నాలుకల ధోరణిగా వ్యవహరిస్తుందని సీపీఎం పార్టీ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి వై.యకయ్య అన్నారు. అరెస్టులు చేసినంత మాత్రాన ఉద్యమాలు అగవని సమస్యల పరిష్కారం ఒక్కటే మార్గమని అన్నారు. బీసీ లకు 42% రిజర్వేషన్స్ అమలు కోసం శుక్రవారం చలో రాజ్ భవన్ కార్యక్రమంలో గవర్నర్ కు మెమో రాండం ఇవ్వడానికి వెల్లిన సీపీఎం పార్టీ రాష్ట్ర నాయకత్వానికి సమయం ఇవ్వకుండా వారిని నిరంకుశంగా అరెస్ట్ చేయడం ఖండిస్తున్నాం అని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ(మర్కిస్ట్) ఆద్వర్యంలో గోదావరిఖని పట్టణం మెయిన్ చౌరస్తాలో బీసీ లకు 42% రిజర్వేషన్స్ అమలు చేయాలని నిరసన కార్యక్రమం చేశారు. కేంద్రంలో బీసీ రిజర్వేషన్ల బిల్లును,ఆర్డినెన్స్ ను అడ్డుకుంటు మరోపక్క 18న బీసీ జేఏసీ ఇచ్చిన బందు పిలుపు కు మద్దతు తెలియ చేయడం సిగ్గుచేటు అన్నారు. బీసీ లకి 42% రిజర్వేషన్స్ అమలు చేయడం కేంద్రానిదే పూర్తి బాధ్యత అన్నారు. కేంద్రం పై ఒత్తిడి పెంచేందుకు అఖిలపక్షం వేసి ఢిల్లీ కేంద్రంగా పోరాటం చేయాలని ఈ పోరాటానికి సీపీఎం పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని అన్నారు. భవిష్యత్ లో సీపీఎం పార్టీ క్రింది స్థాయి నుండి ఉద్యమాలు చేపడుతుందని ఈ కార్యక్రమాలలో బీసీ లు బీసీ సంఘాలు పూర్తి స్థాయిలో పాల్గొనాలని మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పెద్దపల్లి జిల్లా సెక్రెటరియట్ మెంబర్స్ వేల్పుల కుమారస్వామి, ఏ.మహేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు మెదరి సారయ్య, యం.భాగ్యలక్ష్మి, పి.భాస్కర్, ఎస్.కృష్ణకుమారి, వి.పావని, జి.ప్రమీల, ఫేర్విన్, బి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ కృతనిశ్చయంతో ముందుకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్




సిరిసిల్ల,అక్టోబర్17(ఆకాంక్ష) : సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. బీసీ సంఘాలు ప్రకటించిన 18వ తేదీ తెలంగాణ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలుపుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకుంటుందని తెలిపారు. అసెంబ్లీలో బిల్లులు ఆమోదింపజేసి కేంద్రానికి పంపించాం. కానీ కేంద్రం నిర్లక్ష్య ధోరణి చూపడంతో హైకోర్టు స్టే వచ్చింది. అయినా కూడా బీసీ రిజర్వేషన్ల సాధనలో వెనక్కు తగ్గేది లేదు. ప్రజలను మేల్కొలిపేందుకు బీసీ సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపుకు కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు సంఘీభావం తెలిపారు" అని పేర్కొన్నారు. బంద్ విజయవంతం కావాలంటే అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. బీసీలకు న్యాయం చేయాలనే ధ్యేయంతో కాంగ్రెస్ న్యాయపరమైన పోరాటానికి సిద్ధంగా ఉందని, న్యాయ నిపుణులతో ఇప్పటికే సంప్రదింపులు జరిపామని చెప్పారు. బిజెపి నాయకులు కేంద్రం వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నా ఎందుకు స్పందించడం లేదు? రాష్ట్రం నుండి 8 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నారు వాళ్లు ఎందుకు ఒప్పించడం లేదు? అని ప్రశ్నించారు. బీసీల న్యాయమైన హక్కులపై బిజెపి అడ్డుపడకూడదని కోరారు. రాజ్యాంగంలో 50 శాతం రిజర్వేషన్ పరిమితి ఎక్కడా లేదని స్పష్టం చేసిన ఆది శ్రీనివాస్ కోర్టులో సవాలు చేసిన వారు జీఓ 9ని మాత్రమే ప్రశ్నించారు కానీ చట్టాన్ని కాదు. బీసీల కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో ముందుకు సాగుతోంది. బిజెపి నాయకులు కూడా ఆలోచించాలని అన్నారు. 18వ తేదీ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని బీసీలకు న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# శృంగారంలో ఉండగా గుండెపోటు వచ్చిందని భర్తను చంపిన భార్య..!!

## - ప్రేమ వివాహం చివరికి ప్రాణహంతక నాటకమైంది...



కరీంనగర్, అక్టోబర్ 17(ఆకాంక్ష) : కరీంనగర్ నగరంలో చోటుచేసుకున్న దారుణం స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. డబ్బుల కోసం వేధిస్తున్నాడని భర్తను చంపేసిన భార్య కత్తి మౌనిక, తన ఐదుగురు స్నేహితులతో కలిసి ప్రణాళిక రూపొందించి అమలు చేసింది. ఈ ఘటన వెలుగులోకి రాగానే కరీంనగర్ టూ టౌన్ పోలీసులు మౌనికతో పాటు మరో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం... కత్తి మౌనిక, సురేష్ 2015లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీలో నివసిస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఇటీవల మౌనిక వ్యభిచారంలో నిమగ్నమై డబ్బులు సంపాదించసాగింది. భర్త సురేష్ మాత్రం ఆమెపై అనుమానం వ్యక్తం చేస్తూ, నిత్యం డబ్బుల కోసం వేధించేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో విసిగిపోయిన మౌనిక భర్తను హత్య చేయాలనే నిర్ణయం తీసుకుంది. దీని కోసం తన బంధువులైన అరిగె శ్రీజ, పోతు శివకృష్ణ, దొమ్మాటి అజయ్, నల్ల సంధ్య ఊరా వేముల రాధ, నల్ల దేవదాస్‌ల సాయం కోరింది. మొదటగా కూరలో వయాగ్రా మాత్రలు కలిపి చంపాలని ప్రయత్నించినా, సురేష్ వాసన గుర్తించి తినకపోవడంతో ప్లాన్ విఫలమైంది. తరువాత ప్లాన్ బీ ప్రకారం సెప్టెంబర్ 17న సురేష్ మద్యం తాగుతుండగా అందులో బీపీ, నిద్రమాత్రలు కలిపి ఇచ్చింది. మద్యం తాగిన సురేష్ స్పృహ కోల్పోయాడు. వెంటనే మౌనిక చీరతో సురేష్ మెడ బిగించి, కిటికీ గ్రిల్‌కు వేలాడదీసి ఉరేసి చంపేసింది. అనంతరం తన అత్త మామలకు శృంగారంలో ఉండగా గుండెపోటు వచ్చిందని చెప్పి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించింది. అయితే వైద్యులు అప్పటికే సురేష్ మృతిచెందినట్లు ప్రకటించారు. మౌనిక ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు ఆమె కదలికలపై దృష్టి సారించారు. విచారణలో ఆమె హత్యకు సంబంధించిన వివరాలు బయట పెట్టింది. తనతో పాటు అరిగె శ్రీజ, పోతు శివకృష్ణ, దొమ్మాటి అజయ్, నల్ల సంధ్య అలియాస్ వేముల రాధ, నల్ల దేవదాస్‌ల సాయంతో భర్తను హత్య చేసినట్లు ఒప్పుకుంది. సమగ్ర విచారణ అనంతరం టూ టౌన్ పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన కరీంనగర్ నగరంలో తీవ్ర సంచలనంగా మారింది. ప్రేమ వివాహంతో ప్రారంభమైన జీవితం చివరికి హత్యతో ముగిసిన విషాదకథగా నిలిచిపోయింది.

# బీసీ బంద్ లో పాల్గొని పార్టీ నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయడానికి కృషి చేయాలి



గోదావరిఖని, అక్టోబర్ 17(ఆకాంక్ష) : రాష్ట్రవ్యాప్తంగా బీసీ జేఏసీ పిలుపునిచ్చిన బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు మద్దతుగా జరుగుతున్న ఈ బంద్‌కు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు కూడా పూర్తి మద్దతు తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ గుండబోయిన లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ "బీసీలకు న్యాయం చేయగల ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీయే. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర ప్రజలు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలి" అని అన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలని పిలుపు

మెదక్,అక్టోబర్17(ఆకాంక్ష) : మెదక్ జిల్లా పాపన్నపేట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ముశెట్టి కిష్టయ్య ముదిరాజ్ 18న జరగనున్న రాష్ట్ర బంద్ ను విజయవంతం చేయాలని బీసీలకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ న్యాయసమ్మతమని ఆయన పేర్కొన్నారు. బీసీల న్యాయపోరాటానికి అన్ని వర్గాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు సహకరించాలని, రాజకీయ పార్టీలు తమ చిత్తశుద్ధిని చూపించాలని ముశెట్టి కిష్టయ్య ముదిరాజ్ పిలుపునిచ్చారు.



# ఆరోగ్యం

## ఈ ఆహారపదార్థాలను ఎక్కువ మంట మీద వండితే క్యాన్సర్ రావడం పక్కా

చాలా మందికి ఎక్కువగా ఫ్రై అయిన ఆహారపు పదార్థాలను తినాలని ఉంటుంది. అందుకోసం ఎక్కువ మంట మీద ఆహారపదార్థాలను వండుతుంటాము. కానీ కొన్ని ఆహారపదార్థాలను ఎక్కువ మంట మీద వండకూడదు. అలా ఎక్కువ మంట మీద వండితే క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉంటాయి. అందుకే ఆ ఆహారపదార్థాలను చాలా తక్కువ వేడి మీద వండాలి. ఈ స్టోరీలో ఎక్కువగా మంట మీద వండకూడని ఆహారపదార్థాలు ఏంటి? ఆ వస్తువులు ఏవి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

బంగాళదుంపలు దుంపలలో బంగాళదుంప చాలా మందికి ఇష్టమైన కూరగాయ. ఏదో ఒక మార్గంలో ప్రతి రోజూ బంగాళాదుంపలను తీసుకుంటూ ఉంటారు. అటువంటి బంగాళదుంపలను ఎక్కువసేపు వేడి చేసినట్లయితే.. అవి క్యాన్సర్‌కు కారణమయ్యే యాక్రిలమైడ్ అనే హానికరమైన రసాయనాన్ని ఉత్పత్తి చేస్తాయి. అలాంటప్పుడు వాటిని తింటే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి బంగాళదుంపలను ఎప్పుడూ తక్కువ మంట మీద ఉడికించాలి.

గొడ్డు మాంసం గొడ్డు మాంసం చాలా మంది తినడానికి ఇష్టపడరు. కానీ దీనిని తినాలనుకునే వారు చాలా ఎక్కువ మంట మీద ఎక్కువ సమయం వేడి చేస్తుంటారు. అయితే గొడ్డు మాంసాన్ని ఎక్కువ మంట మీద వండినప్పుడు అవి క్యాన్సర్‌కు కారణమయ్యే రసాయనాలను విడుదల చేస్తుంది. అలా ఉడికించిన మాంసాన్ని తినడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది.



బ్రెడ్ ప్రస్తుతం ఉన్న కాలంలో చాలా మందికి బ్రెడ్ ఒక బ్రేక్‌ఫాస్ట్. బ్రెడ్ ఎలాంటిదైనా సరే, దాన్ని అతిగా టోస్ట్ చేసినప్పుడు, అది క్యాన్సర్‌కు కారణమయ్యే యాక్రిలమైడ్ అనే రసాయనాలను ఉత్పత్తి చేస్తుంది, ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి బ్రెడ్‌ను టోస్ట్ చేసేటప్పుడు తక్కువ మంట మీద ఉంచి లైట్ గా టోస్ట్ చేయండి.

చికెన్

చికెన్ చాలా మందికి ఇష్టమైన వంటకం. రోస్ట్ చేసిన చికెన్ ఎక్కువగా తింటూ ఉంటారు. అందులో ఒకటి చికెన్ 65. ఈ చికెన్ 65 చేస్తున్నప్పుడు ఎక్కువ సేపు నూనెలో వేసి ఎక్కువసేపు వేయించినట్లయితే, అది క్యాన్సర్ కారకాలను సృష్టించి, క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి క్యాన్సర్ రాకుండా ఉండాలంటే చికెన్ ఎప్పుడూ తక్కువ వేడి మీద ఉడికించాలి.

చేప గ్రేవీలో తినడానికి ఇష్టపడే వారి కంటే చేపలను వేయించి తినడానికి ఇష్టపడే వారు ఎక్కువ. చేపలను ఇలా ఉడకబెట్టేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే చేపలను అధిక వేడి మీద ఎక్కువసేపు ఉడికించడం వల్ల క్యాన్సర్‌కు కారణమయ్యే హానికరమైన క్యాన్సర్ కారకాలు విడుదలవుతాయి. కాబట్టి వీలైనంత తక్కువ ఉష్ణోగ్రత వద్ద చేపలను ఉడికించాలి.

## మన పూర్వీకులకు కొండలను పిండి చేసే శక్తినిచ్చిన ఫుడ్ ఇదే..

మనందరికీ పులిహోర గురించి తెలిసి ఉంటది కానీ మెలహోర గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలిసి ఉంటది. మొలహోర చాలా పాలకాలం నాటి వంట. వందల ఏళ్లుగా పండుగలు, ప్రత్యేక సందర్భాలలో దీనిని చేసుకొని తినేవాళ్లు. మన పూర్వీకులు ఆరోగ్యంగా ఉండేందుకు కారణమైన వంటల్లో ఈ మొలహోర కూడా ఒకటి. కొంచెం స్పైసీగా,కొంచెం కమ్మగా ఎంత తిన్నా ఇంకా తినాలనిపించే ఈ అద్భుతమైన పాతకాలం నాటి వంటను మీరు మీ ఇంట్లో ట్రై చేయాలనుకుంటే దీని తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

మొలహోర తయారీకి కావాల్సిన పదార్థాలు -బియ్యం -పచ్చికొబ్బరి -ఉప్పు -జీడిపప్పు -మిరియాలు -నెయ్యి -ఇంగువ

మొలహోర తయారీ విధానం -ముందుగా అన్నం వండుకోడానికి వాడే 1 కప్పు రైస్ ని అరగంట సేపు నానబెట్టండి. తర్వాత ఒక కొబ్బరి చిప్పను తీసుకొని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి మిక్సీ గిన్నెలో వేసి ఇందులోనే బియ్యం కొలిచిన కప్ తో 3 కప్పుల వేడి నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. -తర్వాత ఈ మిశ్రమాన్ని ఓ గిన్నెలోకి వడకట్టి తీసుకోండి. వడకట్టగా వచ్చిన కొబ్బరిపిప్పిని మళ్లీ మిక్సీ గిన్నెలో వేసి గ్రైండ్ చేసి తర్వాత దాన్ని కూడా వడకట్టుకోవాలి, -ఇప్పుడు అన్నం వండుకోడానికి గిన్నెతీసుకొని అందులో నానబెట్టిన బియ్యం, వడకట్టగా వచ్చిన కొబ్బరిపాలను 5 కప్పులను పోయాలి. ఇందులోనే రుచికి సరిపడా ఉప్పు వేసి స్టవ్ మీద పెట్టి మీడియం



మంట మీద ఉడకనివ్వాలి. -కొద్దిసేపు ఉడికి దగ్గరపడిన తర్వాత మూతపెట్టి మంటను సిమ్ లో ఉంచండి. మధ్య మధ్యలో మూత తీసి కలుపుతూ ఉడికించండి. -అన్నం కొంచెం జారుగా ఉన్నప్పుడే స్టవ్ ఆఫ్ చేసేయండి. -ఇప్పుడు 2 స్పూన్ల మిరియాలను కచ్చాపచ్చాగా దంచి పక్కనపెట్టుకోండి. -తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి 3 స్పూన్ల నెయ్యి వేసి ఇందులోనే జీడిపప్పులు వేయించుకోండి. -జీడిపప్పులు కొద్దిగా వేగిన తర్వాత అందులో కరివేపాకు, దంచి పెట్టుకున్న మిరియాల పొడి, పావు స్పూన్ ఇంగువ వేసి కలుపుకోండి. -ఈ తాలింపుని వండిన కొబ్బరిపాల అన్నంలో వేసి మెత్తం కలిసేలా కలుపుకోండి. అంతే మొలహోర రెడీ.

## గోంగూర చికెన్ నిల్వ పచ్చడి..





**గోంగూర చికెన్ నిల్వ పచ్చడి..చూస్తే నోరూరిపోతుంది,తింటే అద్భుతంగా ఉంటుంది. దీనిని వేడి వేడి అన్నంలో వేసుకొని తింటే నా సామి రంగా మాటల్లో చెప్పలేని అనుభూతి అంతే. ముఖ్యంగా చలికాలంలో వేడి అన్నంలో ఇది కలుపుకొని తింటుంటే ఇంక ఏమైనా ఉంటుందా చెప్పండి. అయితే ఈ గోంగూర చికెన్ నిల్వ పచ్చడిని తయారు చేసుకోడానికి ఏమేం పదార్థాలు** కావాలి,తయారీ విధానం వంటి వివరాలను ఇక్కడ చూసేయండి.

గోంగూర చికెన్ నిల్వ పచ్చడి తయారీకి కావాల్సిన పదార్థాలు -అర కేజీ చికెన్ -పావు కేజీ గోంగూర -చింతపండు -జీలకర్ర -మెంతులు -ఆవాలు -ధనియాలు -దాల్చిన చెక్క -లంగం -ఆయిల్ -పసుపు -ఉప్పు -కారం -అల్లం వెల్లుల్లి పేస్ట్.

**గోంగూర చికెన్ నిల్వ పచ్చడి తయారీ విధానం:** ముందుగా ఒక గిన్నె తీసుకొని అందులో 250 గ్రాముల గొంగూర వేసి బాగా శుభ్రంగా కడగండి. -కడిగిన గోంగూరని వడగిన్నెలో వేసి నీరు అంతా పోయిన తర్వాత పొడి గుడ్డ మీద వేసి బాగా ఆరబెట్టండి. -ఆరిన గోంగూరని చిన్న ఆకులుగా కట్ చేసుకొని దాన్ని ఓ బౌల్ లో వేసి పక్కనపెట్టుకోండి. -ఇప్పుడు ఓ చిన్న గిన్నెలో నిమ్మకాయ సైజ్ అంత చింతపండు వేసి కొంచెం వేడినీళ్లు అందులో పోసి నానబెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ ఆన్ చేసి పాన్ పెట్టి అర టీ గ్లాస్ వేరుశెనగ నూనె పోసి అది వేడెక్కిన తర్వాత అందులో కట్ చేసి పెట్టుకున్న గోంగూర్ మొత్తం వేసి మంటను మీడియం ఫ్లేమ్ లో పెట్టి 1-2 నిమిషాలు కలుపుతూ వేయించుకోండి. -గోంగూర బాగా వేగిన తర్వాత ముందుగా నానబెట్టుకున్న చింతపండు రసం ఇందులో వేసి కలపండి. మంటలను లో ఫ్లేమ్ లో పెట్టి ఆయిల్ సపరేట్ అయ్యేవరకు కలుపుతూ వేయించుకోండి. -ఇప్పుడు ఇందులోనే అర గ్లాస్ ఆయిల్ పోసి కలుపుతూ వేయించుకోండి. ఆయిల్ పూర్తిగా సపరేట్ అయిన తర్వాత పాన్ ని దించేసి పక్కనపెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద మరో బాండీ పెట్టి అందులో అర టేబుల్ స్పూన్ ధనియాలు, అర టేబుల్ స్పూన్ జీలకర్ర, అర టీ స్పూన్ మెంతులు,1 ఇంచు చెక్క, 4 లవంగ మొగ్గలు వేసి దోరగా వేయించుకోండి. తర్వాత వీటిని మిక్సీ గిన్నెలో వేసి మెత్తని పొడిగా చేసుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 1 టీ గ్లాస్ వేరుశెనగ నూనె పోసి అది వేడెక్కిన తర్వాత అందులో శుభ్రంగా కడుక్కున్న అర కేజీ బోన్ లెస్ చికెన్,అర టీ స్పూన్ పసుపు,1 టీస్పూన్ ఉప్పు వేసి చికెన్ లోని నీరు మొత్తం ఇంకిపోయి ఆయిల్ సపరేట్ అయ్యేంతవరకు మంటలను హై ఫ్లేమ్ లో పెట్టి ఉడికించుకోండి. -తర్వాత ఇందులో 2 టీ స్పూన్ల అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసుకొని అది పచ్చి వాసన పోయే వరకు వేపుకొని స్టవ్ ఆఫ్ చేసేయండి. -చికెన్ ముక్కలు చల్లారిన తర్వాత అందులో ముందుగా మిక్సీలో గ్రైండ్ చేసి ఉంచుకున్న మసాలా పొడి, 5 టేబుల్ స్పూన్ల కారం,సరిపడా ఉప్పు వేసి బాగా కలిపిన తర్వాత ఇందులోనే వేయించుకున్న గోంగూర వేసి బాగా కలపండి.గోంగూర చికెన్ నిల్వ పచ్చడి రెడీ.

## హెూటల్ స్టైల్ చికెన్ టిక్కా



వీకెండ్‌లో చాలా మంది రెస్టారెంట్లకు వెళ్ళడానికి ఇష్టపడుతుంటారు. అలా రెస్టారెంట్లకు వెళ్ళినప్పుడు చాలా మంది చికెన్ స్నాక్స్, చికెన్ స్టార్టర్స్ తినడానికి ఇష్టపడుతుంటారు. అందులో మొదటి వరుసలో ఉండేది చికెన్ టిక్కా. ఈ చికెన్ టిక్కా ఎంతో రుచికరంగా నోట్లో పెట్టుకుంటేనే కరిగిపోయే విధంగా ఉంటుంది. దీనిని మనం ఇంట్లో కూడా తయారు చేసుకోవచ్చు. చాలా సులభమైన పద్ధతిలో క్షణాల్లోనే దీనిని సిద్ధం చేసుకోవచ్చు. అయితే దీనికి కావాల్సిన పదార్థాలు ఏంటి? ఏ విధంగా దీనిని చేసుకోవాలి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.


చికెన్ టిక్కా తయారీకి కావాల్సిన పదార్థాలు

బోన్‌లెస్ చికెన్ పెరుగు కారం ఉప్పు పసుపు అల్లం వెల్లుల్లి పేస్ట్ గరం మసాలా నిమ్మరసం ధనియాల పొడి కసూరి మేథీ బిర్యానీ మసాలా మిరియాల పొడి శనగ పిండి నూనె చికెన్ టిక్కా తయారీ విధానం ఈ చికెన్ టిక్కాను ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. మ్యారినేట్ సరిగ్గా చేసుకుంటే ఇంట్లో చేసుకునే చికెన్ టిక్కా హెూటల్‌లో వాటికంటే మరింత రుచికరంగా ఉంటుంది. అలా చేసుకోవడానికి ముందుగా.. చికెన్‌ను శుభ్రంగా కడుక్కొని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. అందులో ఇప్పుడు పెరుగు, కారం, ఉప్పు, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్, గరం మసాలా, నిమ్మరసం, ధనియాల పొడి, కసూరి మేథీ, శనగ పిండి, మిరియాల పొడి, బిర్యానీ మసాలా వేసుకోవాలి. ఇప్పుడు మనం వేసుకున్న మసాలాలు అన్నీ ఆ చికెన్‌కు పట్టుకునే విధంగా బాగా కలుపుకోవాలి. ఆ మసాలాలు మొత్తం చికెన్‌కు పట్టుకోవడానికి ఒక గంట పాటు మ్యారినేట్ చేసుకున్న చికెన్‌ను పక్కన పెట్టుకోవాలి. సాధారణంగా ఈ చికెన్ టిక్కాను కట్టెల పొయ్యి మీద చేసుకుంటేనే రుచి అద్భుతంగా ఉంటుంది. వీలైతే కట్టెల పొయ్యి మీదే చేసుకోవడానికి ప్రయత్నించండి. లేని యెడల గ్యాస్‌పైన కూడా చేసుకోవచ్చు. అలా ఒక గంట పాటు మ్యారినేట్ అయిన చికెన్‌ను తీసుకొని ఇనుప చువ్వల్లో గుచ్చుకోవాలి. ఆ తరువాత బొగ్గుల మంట మీద ఆ చికెన్ ముక్కలను రెండు వైపులా బాగా కాలే విధంగా నూనె పూసుకుంటూ కాల్చుకోవాలి. రెండు వైపులా సరిగ్గా కాలే వారకు కాల్చుకోవాలి. అప్పుడే ముక్క బాగా ఉడుకుతుంది. రుచి అద్భుతంగా ఉంటుంది. గ్యాస్‌పైన చేసుకోవాలని అనుకునే వ్యక్తులు పెనం పెట్టి, కొద్దిగా ఆయిల్ రాసి, ఆ తరువాత చికెన్ ముక్కలను దానిపై ఉంచి బాగా కాల్చుకోవాలి. చికెన్ ముక్కలను కొంచెం కొంచెం నూనె రాస్తూ రెండు వైపులా బాగా కాల్చుకుంటే ఎంతో రుచికరమైన చికెన్ టిక్కా సిద్ధమైనట్లే.






# ‘కింగ్ 100’ లో టాలీవుడ్ క్వీన్ స్వీటీ...?






నాగార్జున హీరోగా గత ఏడాది సంక్రాంతికి ‘నా సామిరంగ’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా తీవ్రంగా నిరాశ పరచడంతో కథల ఎంపిక విషయంలో నాగ్ ఆచితూచి వ్యవహరిస్తున్నాడు. ఆయన చాలా గ్యాప్ తీసుకుని ఈ ఏడాది కుబేరా, కూలీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన కుబేరా సినిమాలో నాగార్జున ముఖ్య పాత్రలో నటించాడు. ఆ సినిమాకు మంచి టాక్ వచ్చింది. అయితే నాగార్జున పాత్ర విషయంలో ఫ్యాన్స్ సంతృప్తిగా లేరని చెప్పాలి. ఇక రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన కూలీ సినిమాలో నాగార్జున నెగటివ్ రోల్‌లో కనిపించాడు. ఆ పాత్రకు పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. అయితే సినిమా కమర్షియల్‌గా ఆశించిన స్థాయిలో ఆడలేదు. కూలీ సినిమాలో ఏదో మిస్ అయింది అంటూ రివ్యూవర్స్ నెగటివ్ రివ్యూలు ఇచ్చారు.ఒకానొక సమయంలో ఏడాదిలో మూడు నాలుగు, అంతకు మించి సినిమాలతో వచ్చిన నాగార్జున ఇప్పుడు హీరోగా ఏడాదికి కనీసం ఒక్క సినిమాను సైతం విడుదల చేయక పోవడం అభిమానులకు తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. ఎట్టకేలకు నాగార్జున కొత్త సినిమా ప్రారంభం అయింది. తమిళ దర్శకుడు ఆర్ కార్తీక్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాను నాగార్జున 100వ సినిమాగా ప్రచారం చేస్తున్నారు. ఈ మైల్ స్టోన్ మూవీని నాగ్ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో అఖిల్, నాగ చైతన్య ముఖ్యమైన గెస్ట్ రోల్స్ చేస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆ విషయం గురించి అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. ఇక ఈ సినిమాలో హీరోయిన్స్ గురించి మొదటి నుంచి పుకార్లు షికార్లు చేస్తూనే ఉన్నాయి. తాజాగా మరో ఆసక్తికర పుకారు ఒకటి హీరోయిన్ గురించి రావడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నాగార్జున ఇప్పటికే ఈ 100వ సినిమా షూటింగ్‌లో జాయిన్ అయ్యాడు. అధికారికంగా ప్రకటన వచ్చేది ఎప్పుడు అని అక్కినేని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్న ఈ సినిమా షూటింగ్ లో ఇటీవలే టబు సైతం జాయిన్ అయిందని వార్తలు వస్తున్నాయి. నాగార్జున, టబు కలయిక అంటే ఫ్యాన్స్ కి పక్కా పైసా వసూల్ అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో టబుతో కలిసి నాగార్జున నటించిన విషయం తెల్సిందే. ఇప్పుడు మరో హీరోయిన్‌గా అనుష్క ఈ సినిమాలో నటించబోతుంది అనే వార్తలు వస్తున్నాయి. సినిమాలో నాగార్జున డ్యూయల్ రోల్ అనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అదే నిజం అయితే రెండో హీరోయిన్‌గా అనుష్క నటించడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అనుష్క కి నాగార్జున అంటే ప్రత్యేకమైన గౌరవం అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

# ఒక్క యాడ్‌కి రూ.150 కోట్లు ఏంటి భయ్యా?



ఒకప్పుడు కమర్షియల్ యాడ్స్ చాలా సింపుల్‌గా, ప్రొడెక్ట్ గురించి వివరిస్తూ, డైలాగ్స్ చెబుతున్నట్లుగా ఉండేది. కానీ ఇప్పుడు మారింది. సినిమాటిక్‌లో యాడ్స్ ఉంటున్నాయి. యాక్షన్‌తో పాటు, రొమాన్స్, కామెడీ ఇలా అన్నింటిని యాడ్స్‌లో చూపించడం ద్వారా మిని మూవీ అన్నట్లుగా రూపొందిస్తున్నారు. ఒకప్పుడు యాడ్ ఫిల్మ్ మేకర్స్ ప్రత్యేకంగా ఉండేవారు. కానీ ఇప్పుడు యాడ్ ఫిల్మ్‌ను స్టార్ ఫిల్మ్ మేకర్స్ కూడా తీస్తున్నారు. వేల కోట్ల రూపాయలు వసూళ్లు చేసిన సినిమాలకు దర్శకత్వం వహించిన దర్శకులు యాడ్ ఫిల్మ్ ను రూపొందిస్తున్నారు. వందల కోట్ల బడ్జెట్ మూవీలు తీసే నిర్మాతలను యాడ్ ఫిల్మ్ తీయమంటే అదే స్థాయి బడ్జెట్ కోరడం కామన్ విషయం. ఇప్పుడు ఒక యాడ్ ను ఏకంగా రూ.150 కోట్ల బడ్జెట్‌తో తీసేందుకు ప్రముఖ దర్శకుడు అట్లీ రెడీ అయ్యాడు అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో ప్రముఖంగా చర్చ జరుగుతోంది. మొదట రణ్వీర్ సింగ్, శ్రీలీల, బాబీ డియోల్‌లు ముఖ్య పాత్రల్లో అట్లీ దర్శకత్వంలో ఒక భారీ, మెగా ప్రాజెక్ట్ పట్టాలెక్కింది అనే వార్తలు వచ్చాయి. అదేంటి అట్లీ ఇప్పటికే అల్లు అర్జున్ సినిమాను మొదలు పెట్టాడు కదా, వీరితో మళ్లీ సినిమా ఏంటని చాలా మంది షాక్ అయ్యారు. కానీ అసలు విషయం ఏంటి అంటే అది ఒక కమర్షియల్ యాడ్, అది కూడా రూ.150 కోట్లతో రూపొందుతున్న యాడ్ అని సమాచారం అందుతోంది. సాధారణంగా పదుల కోట్లతో యాడ్ తీయడమే చాలా పెద్ద విషయం. అలాంటిది ఏకంగా రూ.150 కోట్లతో యాడ్ అంటే ఖచ్చితంగా చిన్న విషయం కాదు. కమర్షియల్ యాడ్‌కు అంత ఖర్చు చేస్తున్నారంటే ఆ కంపెనీ స్థాయి ఏంటో అనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటి వరకు యాడ్‌కు సంబంధించిన లీక్స్ మాత్రమే బయటకు వస్తున్నాయి. అధికారికంగా ఆ యాడ్ ఎప్పుడు వస్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. దీపావళి సందర్భంగా ఆ కమర్షియల్ యాడ్ గురించి అన్ని విషయాలు బయటకు వస్తాయని బాలీవుడ్ వర్గాల వారు అంటున్నారు. శ్రీలీల, బాబీ డియోల్‌లు తమ ఇన్‌స్టా వాల్స్ పై ఇందుకు సంబంధించిన పోస్ట్‌లు, పోస్టర్స్ షేర్ చేశారు. ఈ యాడ్ నిర్మాణం కోసం భారీ ఎత్తున ఎందుకు ఖర్చు అయింది, అంతగా ఈ యాడ్‌లో ఏం ఉంటుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సాధారణంగా స్టార్స్ కమర్షియల్ యాడ్స్ లో నటించేందుకు పదుల సంఖ్య కోట్లలో పారితోషికం తీసుకుంటారు అనే టాక్ ఉంది. ఈ సినిమాకు ముగ్గురు స్టార్స్ కలిపి భారీ మొత్తమే పారితోషికంగా తీసుకుని ఉంటారు. అయినా కూడా రూ.150 కోట్ల బడ్జెట్ అంటే చాలా పెద్ద విషయం అనేది ప్రతి ఒక్కరి అభిప్రాయం. అందుకే ఈ యాడ్ ఏంటి, ఎలా ఉంటుంది అనే విషయం బాలీవుడ్ వర్గాల వారిలో, మీడియా సర్కిల్స్‌లోనూ ఆసక్తి రేకెత్తించింది అనడంలో సందేహం లేదు. రణ్వీర్ సింగ్ గతంలో ఎన్నో యాడ్స్ లో నటించాడు, శ్రీలీల సైతం యాడ్స్‌కి కొత్తేం కాదు, ఇక బాబీ డియోల్ ఈ మధ్య యాడ్స్ లో కనిపిస్తున్నారు. ఈ ముగ్గురు ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తారో లేదో తెలియదు కానీ, ఖచ్చితంగా ఈ ముగ్గురి కాంబో యాడ్ కి మంచి స్పందన వచ్చే అవకాశం ఉంది. ఈ కమర్షియల్ యాడ్ కోసం అంతర్జాతీయ స్థాయి వీఎఫ్ఎక్స్ కంపెనీ వీఎఫ్ఎక్స్ వర్క్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా అన్ని విధాలుగా ఈ యాడ్ ఆకట్టుకునే విధంగా అట్లీ రూపొందిస్తున్నాడని అంటున్నారు.

# ‘కింగ్ 100’ లో టాలీవుడ్ క్వీన్ స్వీటీ...?



నాగార్జున హీరోగా గత ఏడాది సంక్రాంతికి ‘నా సామిరంగ’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా తీవ్రంగా నిరాశ పరచడంతో కథల ఎంపిక విషయంలో నాగ్ ఆచితూచి వ్యవహరిస్తున్నాడు. ఆయన చాలా గ్యాప్ తీసుకుని ఈ ఏడాది కుబేరా, కూలీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన కుబేరా సినిమాలో నాగార్జున ముఖ్య పాత్రలో నటించాడు. ఆ సినిమాకు మంచి టాక్ వచ్చింది. అయితే నాగార్జున పాత్ర విషయంలో ఫ్యాన్స్ సంతృప్తిగా లేరని చెప్పాలి. ఇక రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన కూలీ సినిమాలో నాగార్జున నెగటివ్ రోల్‌లో కనిపించాడు. ఆ పాత్రకు పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. అయితే సినిమా కమర్షియల్‌గా ఆశించిన స్థాయిలో ఆడలేదు. కూలీ సినిమాలో ఏదో మిస్ అయింది అంటూ రివ్యూవర్స్ నెగటివ్ రివ్యూలు ఇచ్చారు.ఒకానొక సమయంలో ఏడాదిలో మూడు నాలుగు, అంతకు మించి సినిమాలతో వచ్చిన నాగార్జున ఇప్పుడు హీరోగా ఏడాదికి కనీసం ఒక్క సినిమాను సైతం విడుదల చేయక పోవడం అభిమానులకు తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. ఎట్టకేలకు నాగార్జున కొత్త సినిమా ప్రారంభం అయింది. తమిళ దర్శకుడు ఆర్ కార్తీక్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాను నాగార్జున 100వ సినిమాగా ప్రచారం చేస్తున్నారు. ఈ మైల్ స్టోన్ మూవీని నాగ్ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో అఖిల్, నాగ చైతన్య ముఖ్యమైన గెస్ట్ రోల్స్ చేస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆ విషయం గురించి అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. ఇక ఈ సినిమాలో హీరోయిన్స్ గురించి మొదటి నుంచి పుకార్లు షికార్లు చేస్తూనే ఉన్నాయి. తాజాగా మరో ఆసక్తికర పుకారు ఒకటి హీరోయిన్ గురించి రావడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నాగార్జున ఇప్పటికే ఈ 100వ సినిమా షూటింగ్‌లో జాయిన్ అయ్యాడు. అధికారికంగా ప్రకటన వచ్చేది ఎప్పుడు అని అక్కినేని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్న ఈ సినిమా షూటింగ్ లో ఇటీవలే టబు సైతం జాయిన్ అయిందని వార్తలు వస్తున్నాయి. నాగార్జున, టబు కలయిక అంటే ఫ్యాన్స్ కి పక్కా పైసా వసూల్ అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో టబుతో కలిసి నాగార్జున నటించిన విషయం తెల్సిందే. ఇప్పుడు మరో హీరోయిన్‌గా అనుష్క ఈ సినిమాలో నటించబోతుంది అనే వార్తలు వస్తున్నాయి. సినిమాలో నాగార్జున డ్యూయల్ రోల్ అనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అదే నిజం అయితే రెండో హీరోయిన్‌గా అనుష్క నటించడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అనుష్క కి నాగార్జున అంటే ప్రత్యేకమైన గౌరవం అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

# సిల్క్ చీరలో హుందాగా.. అమ్మడి అందానికి ఫిదా!



సాధారణంగా సెలబ్రిటీలు ఫ్యాషన్ దుస్తులతోనే కాకుండా సాంప్రదాయంగా కూడా రెడీ అవుతూ అభిమానులను ఆశ్చర్యపరుస్తూ ఉంటారు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో ప్రత్యేకంగా సిల్క్ చీరలు కట్టుకోవడానికి ఎక్కువ ఆసక్తి కనపరుస్తున్న విషయం తెలిసిందే. అందుకు తగ్గట్టుగా ఎంబ్రాయిడరీతో అందంగా డిజైన్ చేసిన బ్లౌజులు వారి అందానికి మరింత అందాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా సిల్క్ చీరలతో తన అందాన్ని రెట్టింపు చేసుకుని మరింత అందంగా వికసిస్తోంది కాంతార బ్యూటీ రుక్మిణి వసంత్.. కన్నడ సినీ పరిశ్రమకు చెందిన ఈమె మొదట కన్నడలోనే సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ మధ్య తెలుగులో కూడా అవకాశాలు అందుకుంటూ మరింత బిజీగా మారిపోయిన విషయం తెలిసిందే. అలా తొలిసారి గత ఏడాది నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా వచ్చిన ‘అప్పుడో ఇప్పుడో ఎప్పుడో’ అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమా సక్సెస్ అవుతుందని ఎన్నో ఆశలు పెట్టుకుంది. కానీ అనుకున్న స్థాయిలో ఈ సినిమా సక్సెస్ అవ్వలేదు. తర్వాత తమిళంలో ఏ.ఆర్.మురుగదాసు దర్శకత్వంలో శివ కార్తికేయన్ హీరోగా నటించిన ‘మదరాసి’ సినిమాలో కూడా నటించింది.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com